ఆదివారం
ప్రజాశక్తి
ఏప్రిల్ 4, 2004

టూరిస్ట్ గైడ్

కనకదుర్గమ్మ

కంప్యూటర్ కోర్సు చేయాలనుకుంటున్నారా?





హ్యాపీ బర్త్‌డే

(4-4-2004నుండి 10-4-2004వరకు)

లక్ష్మీమాధవి
1సం॥, 4.4.2003
ఉజ్జీవనజ్యోతి-రవికిరణ్
విజయవాడ-కృష్ణా

లక్ష్మీ(భావర)
ఏప్రిల్-4
శ్రీదేవి-భానుప్రకాష్
పాలకొల్లు-ప॥గో॥

వరలక్ష్మి
9సం॥, 4.4.1995
రాఘవ-సూర్యనారాయణ
జగ్గంపేట-తూ॥గో॥

తాజ్‌విన్
1సం॥, 5.4.2003
రిజ్వానా-దష్మీన్
మోక్ష్యశాల-నల్లగొండ

నివేదిత
5సం॥, 5.4.1999
భారతి-రాందాస్
బయ్యారం-ఖమ్మం

వి. భవహర్
2సం॥, 5.4.2002
రవిశ్రీ-రవీంద్రనాథ్
పాలకొల్లు-ప॥గో॥

ఆనంద్ పాల్
3సం॥, 9.4.2001
ఉషా-అనిల్‌కుమార్
నందమూరు-కృష్ణా

గ్రీష్మ
మాధవి-మురళి
పత్తిపూర్-చిత్తూరు

బాబి
1సం॥, ఏప్రిల్-2003
శ్రీలక్ష్మి-వెంకటేశ్వరావు
లూటుకుర్రు-తూ॥గో॥

ఆర్.అనిత
5సం॥, 1999
హరికృష్ణవేణి-రాములు
పురిటిపంట-విజయనగరం

గమనిక: పదేళ్ళ వయస్సు వరకు గల చిన్నారులందరికీ ఈ 'హ్యాపీ బర్త్‌డే' శీర్షిక కింద ఉచితంగా శుభాకాంక్షలు తెలియచేస్తాం. దీనికి మీరు చేయవలసిందల్లా మీ చిన్నారి పుట్టిన రోజుకు **20** రోజులు ముందుగా ఓ కలర్ ఫొటో జత చేసి పుట్టినతేదీ, తల్లిదండ్రుల పేర్లు, చిరునామా వంటి వివరాలు పంపడమే. ప్రజాశక్తి శుభాకాంక్షలతో మీ చిన్నారి పుట్టిన రోజును ఆనందంగా జరుపుకోండి.

పంపవలసిన చిరునామా:

హ్యాపీబర్త్‌డే, ప్రజాశక్తి ఆదివారం అనుబంధం, 1-1-298/4,
స్ట్రీట్ నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20.

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి,
ఆదివారం అనుబంధం



'ఆయారాం-గయారాం' కవర్ స్టోరీ హైలెట్

మార్చి 21, 2004 ఉగాది పర్వదినం నాడు ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో కవర్‌స్టోరీ కథనం 'ఆయారాం-గయారాం' చదివిన తర్వాత ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత పలువురు సినీ ప్రముఖులు బి.జె.పి., కాంగ్రెస్ పార్టీల్లో చేరడం, క్రికెట్ క్రీడాకారులు వివిధ పార్టీలలో చేరడంతో తమ తమ పార్టీలు బలపడతాయని వివిధ రాజకీయ పక్షాలు భావిస్తున్నాయి. అదే విధంగా తాజాగా ప్రముఖ సినీ నటి జయప్రద సమాజ్‌వాది పార్టీలో చేరడం, ఒక పార్టీ నుండి మరొక పార్టీకి వలసలు పోవడం, రాజకీయ నాయకులకు కొత్తేమీ కాదు. ఇలా 'ఆయారాం-గయారాం' అయితే ఓట్లురాలుతాయా? మొత్తానికి కవర్‌స్టోరీ మా అందరినీ ఆకట్టుకుంది.

- కామిడి సతీష్‌రెడ్డి,
జడలపేట, వరంగల్‌జిల్లా

ఆయారాం.. గయారాం కథనం బాగుంది

అధికార కాంక్షతో రాజకీయనాయకులు వేసే కప్పగెంతుల గురించి, వారి దిగజారుడుతనం గురించి వివరిస్తూ రాసిన ఆయారాం. గయారాం కవర్‌స్టోరీ కథనం బాగుంది. నేటి వ్యవస్థలో ఇటువంటి నాయకులే అధికార హోదాలు అనుభవిస్తూ పదవులు ఇచ్చిన పార్టీలనే తన్ని తగలేసే విధంగా తయారవుతున్నారు. ఈ తరహా నాయకులకు, వారిని ప్రోత్సహిస్తే వారికి ప్రజలే తగు గుణపాఠం నేర్పాలి. ఎన్నికల తరుణంలో ఫిరాయింపుదారుల గురించి కథనం ఇచ్చినందుకు అభినందనలు. పొలిటికల్ కార్టూన్లు నవ్విస్తున్నాయి.

వి. యేమాజీ, నిజామాబాద్.
కె. యశ్వంత్‌కుమార్, సికింద్రాబాద్.

కథ బాగుంది..కానీ..,

మార్చి 21వ తేదీ ఆదివారం అనుబంధంలో ప్రచురించిన ఫలితం కథ బాగానే ఉంది. అయితే కథ నడిపిన తీరు, ముగింపు అంతగా నచ్చలేదు. ఈ కథ రాసిన కృష్ణ మాదుగుంది కార్మికుల సమస్యలపై కథలు రాసేపుడు మరింత శ్రద్ధ వహిస్తారని ఆశిస్తున్నాం. ఔరాలో ఇస్తున్న అంశాలు ఆసక్తికరంగా ఉంటున్నాయి.

ఎస్. హేమంత్‌కుమార్, విజయవాడ.
ఆర్. రమేష్‌బాబు, ఆదిలాబాద్,
పి. కుమార్, బ్రాడీపేట, గుంటూరు.

ఆరోగ్యం శీర్షిక ఉపయోగకరం

ఆదివారం అనుబంధంలో ఇస్తున్న ఆరోగ్యం శీర్షిక చాలా ఉపయోగకరంగా ఉంటోంది. వివిధ వ్యాధులు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ప్రతివారం తెలుసుకుంటున్నాము. ఈ శీర్షిక నిర్వహిస్తున్న ప్రజాశక్తికి, వ్యాసాలు రాస్తున్న డాక్టర్లకు కృతజ్ఞతలు. ప్రజాశక్తి అనుబంధంలో వస్తున్న ప్రతివ్యాసం, ఐటమ్ ఆసక్తిగా, ఉపయోగకరంగా ఉంటున్నాయి. కార్టూన్స్, ఔరా, న్యాయసలహాలు, రుచి ఎంతో బాగుంటున్నాయి.

వి.ఎస్. లక్ష్మి, ముషీరాబాద్, హైదరాబాద్.
డి. అరుణ్‌కుమార్, ఖమ్మం.
వై. సుశీల్‌కుమార్, మచిలీపట్నం.

కళాసాహితి బాగుంది

21 మార్చి 2004 ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో కళాసాహితి శీర్షికన ప్రచురించిన సిద్ధేంద్ర భారతీయం బాగుంది. కూచిపూడి నాట్యకళకే వన్నె తెచ్చిన మాధురీ మజుందార్‌ను కూచిపూడి నాట్య విన్యాసం అని చెప్పడం బాగుంది. మాధురీ ముందు ముందు మరెన్నో నాట్య ప్రదర్శనలతో ఆహుతులను ఆకట్టుకోవాలని మనసారా కోరుకుంటున్నాను.

- మేడూరి సత్యనారాయణ,
శాంతినగర్, తిరువూరు, కృష్ణాజిల్లా

మనలో మాట

తిన్నదరక్కపోతే...

అతను పొట్ట పెంచుకున్న ఆసామి!

ఇతను బక్కచిక్కిన మనిషి!

ఇద్దరూ నడిరోడ్డు మీద కలుసుకున్నారు!

ఒకర్నొకరు శ్రద్ధగా పరిశీలించి చూసుకున్నారు!

దేశం కరువుతో కాలిపోతుందని నిన్ను చూసి ఈజీగా చెప్పచ్చు అన్నాడు పొట్టాయన. ఆ కరువుక్కారణం తమర్ని చూసి ఇంకా ఈజీగా చెప్పొచ్చన్నాడు బక్కాయన!

విషయం అర్థమైంది కదా!

ఇంకా వివరణ ఎందుకు?

వదిలేద్దాం!

పొరుగు దేశాల మాటెందుగ్గాని - ఈ దేశంలో 'వారూ' వున్నారు. వారితో పాటు 'వీరూ' వున్నారు!

వారు ఏ శాతంలో బతుకుతున్నారు? వీరు ఎంతమంది బతకలేక చస్తున్నారనే లెక్కలు మీ ముందుంచే ప్రయత్నం చేయడం లేదు!

కాకపోతే -

బతుకు థియరీ గురించి కొంత చెప్పాలనుకుంటున్నాను! ఈ థియరీ కొత్తగా మీ ముందుంచడం లేదు! తరతరాలుగా వస్తున్న పరమ పాత థియరీ!

తిండి కరువైతే -

ఆకలి మంటతో మనిషి అల్లాడిపోతాడు!

తిన్నదరక్కపోతే -

అజీర్తి రోగంతో మనిషి ఇబ్బంది పడతాడు!

అవును కదా?

తిండి కరువు లేమికి సింబలైతే - అజీర్తి రోగం కలిమికి గుర్తు !

కరెక్టేకదా;?

ఈ పరిస్థితిలో -

అన్నమో రామచంద్రా అని ఆర్తనాదం చేసే మనిషికి 'అజీర్తిరోగం' వచ్చిందని సర్టిఫికెటివ్వడం ధర్మమా?

ఆకలికి తాళలేక ఆత్మహత్య చేసుకునే దౌర్భాగ్యానికి - తిన్నదరక్క ఆత్మహత్యలు చేసుకున్నారనే తప్పుడు రిపోర్టు ప్రచారంలో పెట్టడం న్యాయమా?

ఇల్లాంటి దిక్కుమాలిన రిపోర్టుల మూలంగానే - దేశం వెలిగిపోతోందనే ముదనష్టం నినాదాలు పుట్టుకొస్తున్నాయని అర్థం కావడం లేదూ?

అదీ విషయం!

తిన్నదరక్కపోతే - ఇల్లాగే
వుంటాయి మాయ రిపోర్టులు!

ఈ సంచికలో . . .

ఓరా!	. . . 3
కార్టూన్ కదంబం...	. . . 4
కవర్ స్టోరీ	. . . 5
జీవనశైలి	. . . 10
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
ఇంతిసంగతులు	. . . 16
కచేరి	. . . 17
ఆరోగ్యం	. . . 18
పుస్తక పరిచయం	. . . 20
న్యాయసలహాలు	. . . 24

ఇంకా...



ఒక వూరి కథ....

కథ...8, 9

వికలాంగ వార్తాపుత్రిక

రియల్‌స్టోరీ... 14, 15



కృష్ణవేణీ తీరం.. ఇంద్రకీలాద్రి నిలయం

టూరిస్ట్ గైడ్ . . . 21

మాంటిక్స్ సేకరణలో మణిదీపం

కళాసాహితి

. . . 22, 23

ఔరా!

లావు తగ్గాలనుకుంటున్నారా?

చాలామంది భోజనప్రియులు అమితంగా తినేసి ఆనక లావెక్కుతున్నామని తీరిగ్గా విచారిస్తుంటారు. ఇలా అతిగా తినేసి, లావు తగ్గించుకోవడానికి అక్షరాల లక్షన్నర ఖర్చుపెట్ట గలిగిన వారికి ఢిల్లీలోని గంగారాం ఆస్పత్రి వారు ఒక ఆపరేషన్ చేస్తున్నారు. రకరకాల చికిత్సలు, మార్కెట్‌లో లభిస్తున్న బహుళజాతి కంపెనీల వస్తువులతో లావు తగ్గడం మాటెలా ఉన్నా కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అవి మానేస్తే వెంటనే లావెక్కుతున్నారు. కానీ ఇది దీర్ఘకాలిక ప్రక్రియ అని ఓపిగ్గా ఉంటేనే ఫలితం వస్తుందని వారు చెబుతున్నారు. ఆరువారాల్లో బరువు తగ్గి మెరుపుతీగల్లా తయారు కావడం ప్రారంభిస్తారని నమ్మబలుకుతున్నారు. ఇంతకీ వారు చేసే ఆపరేషన్ ఏమిటంటే కడుపులోని జీర్ణాశయానికి బాండ్ వేయడమే. దీనివల్ల జీర్ణాశయం కుంచించుకుపోయి ఆహారం ఎక్కువ తీసుకోలేరు అయినా ఎక్కువ తిన్నట్లుగా ఫీలవుతారు. ఈ విధంగా రెండు సంవత్సరాల్లో సగం బరువు తగ్గించేసుకోవచ్చన్నది వారి నమ్మకమట! కీహోల్ పద్ధతిలో చేసే ఈ ఆపరేషన్ ఖర్చు లక్షన్నర మాత్రమేనట!

స్వయం ఉపాధి

కోటి విద్యలూ కూటికొరకే అన్నది సామెత. అందుకే తెలివైనవారు ఎక్కడ అవకాశం లభిస్తే, అది ఎటువంటిదైనా ఉపయోగించుకుంటున్నారు. ఇండియా-పాక్ క్రికెట్ సందర్భంగా పాకిస్తాన్ వెళ్ళే భారతీయలకు 8 వేలమందికి వీసాలు ఇవ్వడానికి ఆ దేశ ప్రభుత్వం సంసిద్ధత తెలిపింది. వీసాలు ఇచ్చేది 8 వేలే అయినా వాటికోసం లక్షలాది మంది తయారయ్యారు. వీసా దరఖాస్తుల కోసం పాకిస్తాన్ రాయబార కార్యాలయంలో చాంతాడంత క్యూలు వెలిశాయి. గంటలకొద్దీ క్యూల్లో నిలుచున్నా దరఖాస్తు ఫారం లభిస్తుందన్న గ్యారెంటీ లేక క్రికెట్ అభిమానులు అనేకమంది బాధపడుతున్న సమయంలో కొందరు నిరుద్యోగ యువకులకు మంచి ఐడియా వచ్చింది. వెంటనే ఆచరణలో పెట్టారు. కొన్ని టైప్‌రైటర్లు, తెల్లకాగితాలు తెచ్చుకుని దరఖాస్తు ఫారాలు టైపు చేసి ఇవ్వడం ప్రారంభించారు. పాకిస్తాన్ రాయబార కార్యాలయం వీసా దరఖాస్తులను ఉచితంగా ఇస్తోంది. కాని వారు ఇన్ని లక్షల మందికి ఎక్కడి నుండి తెచ్చిస్తారు. నిరుద్యోగులేమో ఒక్కో ఫారం ధర తొలుత నలభై రూపాయలుగా నిర్ణయించారు. డిమాండ్ విపరీతంగా పెరగడంతో అరవై, ఎనభై రూపాయల వరకు పెంచి సొమ్ము చేసుకున్నారట. క్రికెట్ అభిమానులకు వీసాలు దక్కకపోయినా కనీసం దరఖాస్తులైనా దొరికినందుకు సంబరపడ్డారట!

వృషభ కళ్యాణం!?



వృషభానికి కళ్యాణం ఏమిటా అని ఆశ్చర్యపోతున్నారా? ఒరిస్సాలోని ఓ పల్లెలో నిజంగా జరిగింది. భువనేశ్వర్‌కు 312 కిలోమీటర్ల దూరంలో గల సరిగిపల్లి అనే గ్రామంలో ఒక జంటకు పిల్లలు పుట్టరని డాక్టర్లు తేల్చి చెప్పేశారట. పిల్లలు లేకపోతే నష్టం లేదని తమకు వ్యవసాయంలో అక్కరకు వస్తున్న ఒక బుల్లి కోడిదూడను దత్తత తీసుకుని పెంచుకున్నారు. దానికి పెళ్ళి ఈడు రావడంతోనే మంచి ఆవుకోసం ఊరంతా వెతికారు. పొరుగునే గల ఆసామి ఇంట్లో ఉన్న ఆవుతో తాము బిడ్డలా పెంచుకున్న ఎద్దుకు పెళ్ళి కుదుర్చుకున్నారు. తాంబూలాలు మార్చుకుని, ముహూర్తాలు పెట్టుకుని వేదపండితులు మంత్రాలు చదువుతుంటే గో-వృషభాల పెళ్ళి ఘనంగా జరిపించి ముచ్చట తీర్చుకున్నారట ఆ దంపతులు. పెళ్ళికి హాజరైన 5 వేల మందికి మంచి మిఠాయిలు కూడా పంచిపెట్టారుట. ఎవరి ఆనందం వారిది!


సీటు కుంపట్లు
తిరుగుబాట్లు
రాజీనామాలు
అసమ్మతి
ముదిరిన ఎండలు

కార్టూన్ కదంబం


పార్టీ
పార్టీ
వాగ్దానాలు
వాగ్దానాలు
ఓట్లు

ఆలయ నిర్మాణం, మతమార్పిళ్లపై నిషేధం
ఆర్టికల్ 370, ఉమ్మడి పౌరస్మృతి
బిజెపి దార్శనిక పత్రం
నారు



కంప్యూటర్ కోర్సు చేయాలనుకుంటున్నారా?

బోగస్‌లుంటాయి జాగ్రత్త...

ఆధునిక జీవితంలో కంప్యూటర్ ఒక భాగమైపోతోంది. ఇ-సేవలు, సైబర్‌కేఫ్‌లు పల్లెలకూ విస్తరిస్తున్నాయి. ఉపాధి అవకాశాలు ఎలా వున్నా హైటెక్ ప్రభుత్వం చేస్తున్న ప్రచారంతో యువత కంప్యూటర్ విద్య పట్ల మోజు పెంచుకుంటోంది. దీన్ని ఆసరాగా తీసుకుని అనేక బోగస్ సంస్థలు వెలుస్తున్నాయి. పదవతరగతి, ఇంటర్ చదివి కంప్యూటర్ విద్య పట్ల ఆసక్తి గల యువతీ, యువకులు కోర్సుల పట్ల అవగాహన లేక ఈ బోగస్ సంస్థల మాయలోపడి డబ్బు వదిలించుకోవడమే గాకుండా, భవిష్యత్ పాడుచేసుకుంటున్నారు. అందుకే పబ్లిక్ పరీక్షలు పూర్తయిన ఈ తరుణంలో కంప్యూటర్ కోర్సుల పట్ల విద్యార్థుల్లో అవగాహనకోసం ఈ కథనం...

కె.ఎక్స్.రాజు

ఆధునిక ప్రపంచంలో కంప్యూటర్‌రంగం రోజురోజుకూ విస్తృతమవుతోంది. దీంతో అన్ని రంగాల్లో వలెనే విద్యా రంగంలోనూ అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా అన్ని రకాల ఉద్యోగాలకూ కంప్యూటర్ అర్హతలను పరిగణనలోకి తీసుకొంటున్నారు. ముఖ్యంగా కంప్యూటర్ సంబంధిత ఉద్యోగాలకు ఒకింత డిమాండ్ పెరగడంతో తదనుగుణంగానే కంప్యూటర్ కోర్సులకు విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. విద్యార్థులు, నిరుద్యోగులుగా వున్నవారు ఈ కోర్సులను అభ్యసించడం ద్వారా విదేశాలకు వెళ్ళి, డాలర్లు సంపాదించాలని కలలుగనడం పరిపాటి అయింది. దీనికి పత్రికల్లో వస్తున్న వార్తలు మరింత ఆజ్యం పోస్తున్నాయి. ఈ ప్రకటనలు, వార్తలు, ఉద్యోగావకాశాలు, విదేశీ మోజు యువతను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఒకవేళ కంప్యూటర్ కోర్సులు చదవకపోతే తాము ఎందుకూ పనికిరామేమోననే భయం ఒకవైపు, కంప్యూటర్ కోర్సులు నేర్చుకోకపోతే తమ పిల్లలు తోటివారితో పోటీ పడలేరేమోననే తల్లిదండ్రుల ఆందోళన మరోవైపు ఈ కంప్యూటర్ కోర్సుల పట్ల విపరీతమైన క్రేజ్‌కు కారణమవుతున్నాయి. ఇంతకుముందు ఇంజనీరింగ్, ఎంసిఎ వంటి కోర్సులు చదివేవారికి మాత్రమే కంప్యూటర్ గురించిన ఆలోచనలుండేవి. ఇప్పుడు ప్రాథమిక తరగతుల నుండే కంప్యూటర్ విద్యాబోధన ఈ రోజుల్లో సర్వసాధారణమైపోయింది. దీంతో గుర్తింపు పొందిన సంస్థలతోపాటు చిన్నాచితక సంస్థలు అనేకం పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఇటువంటి సంస్థల పట్ల సరైన అవగాహన లేకపోవడంతో పేపరు ప్రకటన చూసో లేక స్నేహితులు చెప్పారనో ఏదో ఒక సంస్థలో చేరి వేలాది రూపాయలు ఖర్చుచేసి తను సంపాదించిన సర్టిఫికెట్, తనలో ఎన్నో ఆశలకు ఊపిరి పోసిన ఆ సర్టిఫికెట్ ఉద్యోగవేటలో ఎందుకూ పనికిరాదని, ఆ సర్టిఫికెట్ ఇచ్చిన సంస్థలు బోగస్‌వని తెలిసినప్పుడు వారు పడే వేదన వర్ణనాతీతం. ఒకటీ అరా ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు కూడా లేకపోలేదు. ప్రభుత్వం కూడా ఇటువంటి బోగస్ సంస్థలపై చర్య తీసుకోకపోగా చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో కంప్యూటర్ కోర్సులను అభ్యసించాలనుకున్నవారు ఎటువంటి కోర్సులను అభ్యసించాలి, వాటిని ఏ సంస్థలు అందిస్తున్నాయి, ఆయా సంస్థలకు ప్రభుత్వ గుర్తింపు వుందా? అనే విషయాలను తెలుసుకోవాల్సివుంది. అంతేకాకుండా మన లక్ష్యం ఏమిటి? దాన్ని చేరుకోవడానికి కావాల్సిన కోర్సులు, వాటివల్ల వచ్చే ఉపాధి అవకాశాలు వంటి పలు అంశాలు పరిగణనలోకి తీసుకొని ప్రణాళికాబద్ధంగా లక్ష్యాన్ని చేరుకోవాలి.

కంప్యూటర్ రంగంలో రోజురోజుకూ సంభవిస్తున్న మార్పుల ఫలితంగా రోజుకో కొత్త కోర్సు పుట్టుకొస్తోంది. దీంతో ఏ కోర్సుకు ఎప్పుడు, ఎంత డిమాండ్ వుంటుందనేది చెప్పలేం. మారుతున్న కాలాన్నిబట్టి కాలేజీలు, యూనివర్శిటీలలో కూడా వైవిధ్యమైన కోర్సులు ప్రవేశపెడుతున్నారు. ముఖ్యంగా 80వ దశకం తర్వాత అనేక యూనివర్శిటీలు కంప్యూటర్

సైన్స్ కోర్సులను ప్రత్యేకంగా ప్రవేశ పెట్టాయి. నేడు రాష్ట్రంలో అనేక విద్యాసంస్థలు 10వ తరగతి నుండే వివిధ రకాల కంప్యూటర్ కోర్సులను అందిస్తున్నాయి. వీటితోపాటు వీధికో కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ దర్శనమిస్తోంది. దీనితో కంప్యూటర్ కోర్సులు చేయాలనుకునే వారు ఏ కోర్సులు చేయాలి, ఏ సంస్థలో జాయిన్ అవ్వాలో నిర్ధారించుకోలేకపోతున్నారు. అందువల్ల ఏ కోర్సులను ఏ సంస్థలు అందిస్తున్నాయి, ఆ కోర్సుల వల్ల ఏ మేరకు ఉపాధి లభిస్తుందనే విషయాలను తెలుసుకోవడం ఎంతైనా అవసరం.

విద్యార్థులు తమ భవిష్యత్‌ను నిర్దేశించుకునేది 10వ తరగతి దాటిన తర్వాత నుండేననే విషయం అందరికీ తెలిసిందే. 10వ తరగతి తర్వాత కంప్యూటర్ కోర్సులలో జాయిన్ కావాలంటే పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ రాసి, కంప్యూటర్ కోర్సు తీసుకోవడమొక్కటే మార్గం. దీని ద్వారా డిసిఎ (డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్) చేయవచ్చు. ఈ కోర్సును స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ & ట్రైనింగ్ వారు నిర్వహిస్తారు. డిసిఎ తర్వాత ఇసెట్ రాసి, ఇంజనీరింగ్ సెకండియర్‌లోకి డైరెక్ట్‌గా వెళ్ళవచ్చు. తద్వారా బిఇ గానీ, బిటెక్ గానీ పూర్తిచేయవచ్చు. దీని తర్వాత గేట్ ద్వారా ఎంటెక్ చేయవచ్చు. 10వ తరగతి నుండే కంప్యూటర్ కోర్సులు చేయాలంటే ఈ విధంగా చేయాలే తప్ప ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్‌లలో చేరి ఏదోఒక డిప్లొమా చేయడం సరైన నిర్ణయం కాదు.

ఇంటర్మీడియట్ తర్వాత కంప్యూటర్ చేయాలంటే ఎన్నో అవకాశాలున్నాయి. ముఖ్యంగా మేథమెటిక్స్ గ్రూప్‌వారికి మంచి అవకాశాలున్నాయి. ఉదాహరణకు ఎంసెట్ లేదా ఎంసిఎ చేయాలంటే ఎంపిసి సబ్జెక్ట్స్‌లో ఇంటర్మీడియెట్ పూర్తి చేయాల్సి వుంటుంది. ఒకేషనల్ కోర్సులు చేసే విద్యార్థులు తర్వాతి కోర్సులుగా ఎంపిసి సబ్జెక్ట్‌లో బ్రిడ్జ్ కోర్సును పూర్తిచేసి, ఉన్నత విద్యలకుగాని, ఎంసెట్ వంటి ఎంట్రెన్స్ పరీక్షలకుగానీ అర్హత సంపాదించవచ్చు. అయితే కంప్యూటర్ రంగానికి సంబంధించిన కంప్యూటర్ సైన్స్, డిటిపి & ప్రింటింగ్ టెక్నాలజీ, కంప్యూటర్ గ్రాఫిక్స్ & యానిమేషన్ వంటి కోర్సులు అందుబాటులో వున్నాయి.

కంప్యూటర్ సైన్స్ :

కంప్యూటర్లను ఉపయోగించడం, ఆఫీస్ అప్లికేషన్స్ వంటి వాటిని ఉపయోగించడంతోపాటు కంప్యూటర్లకు సంబంధించిన పెరిఫెరల్స్‌ను ఉపయోగించడం, ప్రోగ్రామింగ్‌లో కొద్దిపాటి పరిచయం ఈ కోర్సులలో నేర్పుతారు. రెండు సంవత్సరాల కాల పరిమితి గల ఈ కోర్సులలో Computer Fundamentals &IT, Discrete Mathematics, Office Automation Concepts, Fundamentals of Accountancyలో థియరీ సబ్జెక్టులకు గాను ప్రోగ్రామింగ్ టెక్నిక్స్, ఆపరేటింగ్ సిస్టమ్స్, ఆఫీస్ ఆటోమేషన్ కాన్సెప్ట్స్, ఫైనాన్షియల్ ప్యాకేజెస్ అనే ప్రాక్టికల్ సబ్జెక్టులు వుంటాయి.

డిటిపి & ప్రింటింగ్ టెక్నాలజీ:

దీనిలో డిటిపి సబ్జెక్ట్ ఒక్కటే కంప్యూటర్‌కు సంబంధించినది కాగా, మిగిలినవి ప్రింటింగ్ టెక్నాలజీకి సంబంధించినవి. స్క్రీన్ ప్రింటింగ్, ఆఫ్‌సెట్ ప్రింటింగ్, ప్లేట్‌మేకింగ్, ప్రీప్రెస్ వంటి అనేక అంశాలను ఈ కోర్సులలో నేర్పుతారు. డిటిపి థియరీ సబ్జెక్ట్‌లలో కంప్యూటర్ ఫండమెంటల్స్, ఎం.ఎస్.డాస్, విండోస్95 ఆపరేటింగ్ సిస్టమ్, వర్డ్ ప్రాసెసింగ్, పేజ్‌మేకర్, ఫొటోషాప్, కొరెల్‌డ్రా, ఇల్లస్ట్రేటర్, ఇన్‌స్టంట్ ఆర్టిస్ట్ వంటి సాఫ్ట్‌వేర్స్ నేర్పుతారు. వీటితోపాటు వెబ్‌డిజైన్, హెచ్.టి.ఎం.ఎల్., పోస్ట్‌స్క్రిప్ట్ లాంగ్వేజిలు కూడా ఈ కోర్సులలో వుంటాయి.

ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సులు, షార్ట్‌టర్మ్ సర్టిఫికెట్ కోర్సులకు సంబంధించిన మరిన్ని వివరాలను మీకు దగ్గర్లోని ఏదేనీ జూనియర్ కాలేజీల్లో గానీ, State Institute of Vocational Training, Office of Commissionerate of Intermediate Education, Nampally, Hyderabad-500 001 నుండిగాని పొందవచ్చు. లేదా http://interboardap.nic.in సైట్ నుండి పొందవచ్చు.

కంప్యూటర్ గ్రాఫిక్స్ & యానిమేషన్:

కంప్యూటర్ గ్రాఫిక్స్ మరియు యానిమేషన్ రంగంలో నిపుణులను తయారు చేయడానికి ఈ కోర్సులు ఉపకరిస్తాయి. ఈ కోర్సులలో ఫండమెంటల్స్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్, మార్కెటింగ్ & అడ్వర్టయిజింగ్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ మరియు పీసీ సాఫ్ట్‌వేర్ టూల్స్ అనే థియరీ సబ్జెక్ట్‌లు వుంటాయి. వీటితోపాటు గ్రాఫిక్స్‌కు సంబంధించిన విజువలైజేషన్ అండ్ యానిమేషన్, వివిధ 2డి, 3డి గ్రాఫిక్ అప్లికేషన్స్, ఇంటర్నెట్ టెక్నాలజీ, మల్టీమీడియా టెక్నాలజీ & అప్లికేషన్స్ లభ్యమవుతాయి.

వీటితోపాటు ఇంటర్మీడియట్ తర్వాత కంప్యూటర్ రంగంలో వున్నత స్థాయి ఉద్యోగాలను కల్పించే ఇంజనీరింగ్ కోర్సులు, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ రంగంలో అవకాశాలు కల్పించే బిసిఎ, ఎంసిఎ, బిఎస్సీ కోర్సులు, ఎంఎస్సీ, ఎంటెక్ వంటి అనేక కోర్సులున్నాయి.



ఇంజనీరింగ్ కోర్సులు :

కంప్యూటర్ రంగంలో ఉన్నత ఉద్యోగాలను కల్పించే మొట్టమొదటి కోర్సు ఇది. ఈ కోర్సు చదివినవారు కంప్యూటర్ రంగంలో అత్యధిక ఉద్యోగాలు సంపాదిస్తున్నారు. ఐదు సంవత్సరాల క్రితం రాష్ట్రంలోని 30 ఇంజనీరింగ్ కళాశాలల్లో సుమారు 1,000 కంప్యూటర్ సైన్స్ సీట్లు వుండగా, ఇప్పుడు 220 ఇంజనీరింగ్ కళాశాలల్లోని అన్ని బ్రాంచీలు కలిపి 23,000 సీట్లు వున్నాయి. గతంలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ కోర్సు మాత్రమే వుండగా, ప్రస్తుతం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ & సిస్టమ్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ ఇంజనీరింగ్ వంటి కోర్సులు లభ్యమవుతున్నాయి. ప్రభుత్వ/ యూనివర్శిటీ కళాశాలల్లో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ కోర్సు మాత్రమే లభిస్తుండగా, ప్రైవేట్ కళాశాలల్లో కంప్యూటర్ సైన్స్‌తోపాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కోర్సులు కూడా లభ్యమవుతున్నాయి.

ఎంసిఎ:

ఇంజనీరింగ్ తర్వాత అత్యధిక శాతం ఉద్యోగావకాశాలను అందించే ఎంసిఎ (మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్) రాష్ట్రంలోని అనేక యూనివర్శిటీల్లో, వాటి అనుబంధ కళాశాలల్లో అందుబాటులో వున్నాయి. రాష్ట్రంలోని 263 కళాశాలల్లో సుమారు 12,795 సీట్లు లభ్యమవుతున్నాయి. ఆంధ్రా యూనివర్శిటీ, జెఎన్‌టియు, కాకతీయ యూనివర్శిటీ, శ్రీవెంకటేశ్వర యూనివర్శిటీ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, NIITలలోను, వాటి అనుబంధ కళాశాలల్లో ఐసెట్ (ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్) ద్వారా అడ్మిషన్లు జరపబడతాయి. అయితే యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో మాత్రం ఆ యూనివర్శిటీ నిర్వహించే ఎంట్రెన్స్‌లో ఉత్తీర్ణులు కావాల్సివుంటుంది. 3 సంవత్సరాల కాలపరిమితి గల ఈ కోర్సులో వివిధ ప్రోగ్రామింగ్ లాంగ్వేజిలు, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ పద్ధతులు, సాఫ్ట్‌వేర్ కోడింగ్, డెవలపింగ్ వంటి కోర్సులు వుంటాయి. ఈ కోర్సు ఆరు సెమిస్టర్లుగా విభజించబడింది. మొదటి ఐదు సెమిస్టర్లలో థియరీ, ప్రాక్టికల్ సబ్జెక్టులు వుండగా, ఆరో సెమిస్టర్ మాత్రం ప్రాజెక్ట్ వర్క్‌కి కేటాయించబడింది.

ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్:

ఈ కోర్సు కాలపరిమితి రెండు సంవత్సరాలు. ఇంటర్మీడియట్, డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివినవారు మాత్రమే అర్హులు. అంతేగాకుండా డిగ్రీ స్థాయిలో కంప్యూటర్ సైన్స్‌గాని



కంప్యూటర్ అప్లికేషన్స్ గాని ఒక సబ్జెక్టుగా వుండాలి. దీనిలో నాలుగు సెమిస్టర్లు వుండగా చివరి సెమిస్టర్‌లో ప్రాజెక్ట్ వర్క్ చేయాల్సివుంటుంది.

ఎమ్మెస్సీ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్:

బిసిఎ విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేందుకు వీలుగా ఈ కోర్సు అందిస్తున్నారు. ఈ కోర్సులోనూ నాలుగు సెమిస్టర్లు వుంటాయి.

ఎంటెక్: ఇంజనీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించేందుకు వీలుగా అనేక యూనివర్శిటీలు ఎంటెక్ (మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ) కోర్సు అందిస్తున్నాయి. గేట్ స్కోర్‌పై ఆధారపడి అడ్మిషన్లు జరిగే ఈ కోర్సులలో అనేక యూనివర్శిటీలు స్పెషలైజేషన్స్‌ని అందిస్తున్నాయి. కొన్ని యూనివర్శిటీలు ఈవెనింగ్ ప్రోగ్రామ్‌లు, కరస్పాండెన్స్ ప్రోగ్రామ్‌లను కూడా అందిస్తున్నాయి. ఉస్మానియా యూనివర్శిటీ వారు ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్& ఇంజనీరింగ్) కోర్సుని ఫుల్‌టైమ్, పార్ట్‌టైమ్‌గా కూడా అందిస్తున్నారు. రాష్ట్రంలోని ఇతర యూనివర్శిటీల్లోనూ అనేక వైవిధ్యమైన కోర్సులు అందించబడుతున్నాయి. సంబంధిత కళాశాలలను సంప్రదించడం ద్వారా తగిన సమాచారాన్ని పొందవచ్చు. లేదా ఆయా కళాశాలలకు సంబంధించిన వెబ్‌సైట్స్‌లో కూడా ఈ సమాచారం లభ్యమవుతోంది.

బిఇ/ బిటెక్ కోర్సులు:

వివిధ యూనివర్శిటీలు, రీజనల్, ఇంజనీరింగ్ కాలేజీల్లో ఈ కోర్సులను అందిస్తున్నారు. 4 సంవత్సరాల కాలపరిమితి గల ఈ కోర్సులలో ఎంసెట్‌లో ర్యాంకులు పొందడం ద్వారా సీటు సాధించవచ్చు. ఈ కోర్సుపూర్తి చేయడానికి గవర్నమెంట్ సీటు అయితే సుమారు రూ.50వేలు, ప్రైవేట్ సీటు అయితే సుమారు రూ.2లక్షల వరకూ ఖర్చు అవుతుంది. వీరికి తర్వాగా జాబ్‌లు రావడానికి అవకాశం వుంది.

బిసిఎ: మూడు సంవత్సరాల కాల పరిమితి గల బిసిఎ (బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్) కోర్సు డిగ్రీ చదువుతూ కూడా పూర్తి చేయవచ్చు. ఈ కోర్సు చేసినవారు ఎంసిఎ రెండో సంవత్సరంలోకి అర్హత సంపాదిస్తారు. ఇంటర్మీడియట్ మేథమెటిక్స్ సబ్జెక్టుగా కలవారు మాత్రమే దీనికి అర్హులు.

పైన చెప్పినవన్నీ విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలలు లేక అదే స్థాయి గలిగిన ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు మాత్రమే నిర్వహించగలిగిన కోర్సులు. వీటితోపాటు షార్ట్‌టర్మ్ కోర్సులు అనేకం వున్నాయి. ఈ రంగంలో స్థిరపడాలనుకునేవారికి రెండు రకాలైన కోర్సులు అందుబాటులో వున్నాయి. వీటిలో ఒకటి: బేసిక్

రాష్ట్రంలోని అన్ని యూనివర్శిటీలకు సంబంధించిన మరింత సమాచారం కోసం ఆయా యూనివర్శిటీల వెబ్‌సైట్లను సందర్శించవచ్చు.
www.osmania.ac.in
www.jntu.ac.in
www.uohyd.ernet.in
http://svuni.ap.nic.in
http://skuniv.ap.nic.in
www.kakatiya.ac.in
www.nagarjunauniversity.com
www.nitw.ernet.in
www.iiit.net
www.msitprogram.net
www.apsche.org

కోర్సులు, రెండు : అడ్వాన్స్‌డ్ కోర్సులు.

బేసిక్ కోర్సులు:

దీనిలో కంప్యూటర్స్‌కు సంబంధించిన ప్రాథమిక అంశాలను నేర్పుతారు. కంప్యూటర్ అంటే ఏమిటి? దాన్ని ఎలా పనిచేయించాలి? ప్రోగ్రామింగ్ అంటే ఏమిటి? వంటి విషయాలు ఈ బేసిక్ కోర్సులలో వుంటాయి. అడ్వాన్స్‌డ్ కోర్సులు చేసేవారు కూడా బేసిక్ ప్రిన్సిపుల్స్ నేర్చుకోవాల్సిందే కనుక ఈ కోర్సులకు

ఎప్పుడూ డిమాండ్ వుంటుంది. ఈ కోర్సులకు పెద్దపెద్ద సంస్థలలో చేరకపోయినా చిన్న సంస్థలలోనైనా నేర్చుకోవచ్చు. ఆపరేటింగ్ సిస్టమ్, ఎం.ఎస్.ఆఫీస్, స్ప్రెడ్‌షీట్స్ వంటి ఇతర సాఫ్ట్‌వేర్స్ గురించి నేర్పడం జరుగుతుంది. ఈ కోర్సులు నేర్చుకోవడానికి ఒకటి నుండి మూడు నెలల కాలం పడుతుంది.

అడ్వాన్స్‌డ్ కోర్సులు:

C, C++, Cobal, Pascal, Java, HTML, PHP, Visual Basic, Visual C++, Oracle, MS-Sql Servers, Sybax, Novell Netware వంటివన్నీ పైనుదహరించిన ఉన్నత విద్యాకోర్సులలో కొన్ని సబ్జెక్టులుగా వుంటాయి. కానీ ప్రైవేట్ సంస్థలు వీటిని దేనికదే ప్రత్యేక సబ్జెక్టులుగా బోధిస్తూ అత్యధిక ఫీజులను వసూలు చేస్తుంటాయి. APTECH వారి ARENA సంస్థ మల్టీమీడియా కోర్సులను అందిస్తుండగా, EDIT, అమెరికా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, పేస్ వంటి అనేక సంస్థలు క్వాలిటీ ఎడ్యుకేషన్‌ను అందిస్తున్నాయి. మధ్య తరగతి వారికి ఈ కోర్సులు కొంతమేరకు అందుబాటులో వుంటాయి.

సంస్థల ఎంపికలో జాగ్రత్తలు

యూనివర్శిటీలు, వాటి అనుబంధ కళాశాలలతోపాటు కొన్ని ప్రైవేట్ సంస్థల్లో కూడా ఆయా సంస్థలు అందిస్తున్న కోర్సులకు సంబంధించిన అన్ని సదుపాయాలను కల్పిస్తున్నాయి. కానీ కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలతోపాటు షార్ట్‌టర్మ్, లాంగ్‌టర్మ్ కోర్సులనందిస్తామంటూ ప్రచారం చేసుకునే కొన్ని సంస్థలు సరైన సదుపాయాలు కల్పించలేకపోవడమేగాక, నిపుణులైన బోధనా సిబ్బంది కూడా లేకుండానే వేలాది రూపాయలను ఫీజుల రూపంలో వసూలు చేస్తున్నారు. ఏదైనా సంస్థలో జాయిన్ అవ్వాలనుకునే విద్యార్థులు ముందుగా ఆ సంస్థ యొక్క చరిత్ర ఏమిటి? మనం చేసే కోర్సుల ప్రాక్టికల్స్‌కు అవసరమైన లాబ్ సౌకర్యం వుందా? ఒక్కో కంప్యూటర్‌కు ఎంతమందిని కేటాయిస్తున్నారు అనేది తెలుసుకోవాలి. కొన్ని సంస్థలు 24 గంటలూ లాబ్ సౌకర్యం అందిస్తామని చెపుతుంటారు. అది ఎంతవరకు నిజం అనేది ఆయా సంస్థల్లో చదువుతున్నవారినుండి తెలుసుకోవాలి. ముఖ్యంగా అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ వుందా? అనే విషయం తెలుసుకోవాలి. ముఖ్యంగా ప్రైవేట్ సంస్థల యాజమాన్యాలు విద్యార్థులకు అనేక ఆశలు కల్పిస్తుంటాయి. తమ సంస్థలో కోర్సు పూర్తయిన వెంటనే తమకు అనుబంధంగా వున్న కంపెనీలలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఆశలు కల్పిస్తూ వేలాది రూపాయలు వసూలు చేస్తుంటారు. ఇటువంటి ఇన్‌స్టిట్యూట్‌ల పట్ల జాగ్రత్తగా వుండాలి. ఇటీవల సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను నమ్మించి, వారి నుంచి వేలాది రూపాయలను ఫీజుల రూపంలో వసూలు చేసి ఉడాయించిందో సంస్థ. చెన్నైలోని ఎస్.డి.వి. టెక్నాలజీస్ లిమిటెడ్ సంస్థకు అనుబంధంగా శివకుమార్ అనే వ్యక్తి తన స్నేహితులతో కలిసి సికింద్రాబాద్‌లో దాదాపు 10నెలల క్రితం ఒక ట్రైనింగ్ సెంటర్‌ను, మాదాపూర్‌లో ఒక డెవలపింగ్ సెంటర్‌ను నెలకొల్పారు. మొదట ట్రైనింగ్ ఇచ్చి, తర్వాత తమ డెవలపింగ్ సెంటర్‌లోనే ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి ఉద్యోగార్థులను నమ్మించారు. ట్రైనింగ్ కోసం ఫీజులుగా ఒక్కొక్కరి వద్దనుండి రూ.30వేల నుండి రూ.లక్ష వరకూ వసూలు చేశారు. బాధితుల అంచనా ప్రకారం దాదాపు 2000మంది నుంచి రూ.5కోట్లకు పైగా వసూలు చేశారు. ఈ క్రమంలో కొంతమందికి నామమాత్రంగా ఉద్యోగాలు ఇచ్చి కొంత జీతం ఇచ్చినప్పటికీ తర్వాత కొద్దిరోజులకే ఆ కార్యాలయాన్ని మూసేసి పరారయ్యారు. ఇలాంటివి రాష్ట్రంలో అనేక సంఘటనలు జరుగుతు న్నాయి. వేలాది రూపాయ లు వెచ్చించి కంప్యూటర్ కోర్సులు చేయాలనుకునే వారు ముందుగా ఆయా సంస్థలయొక్క చరిత్రను తెలుసుకోవడం ఎంతైనా మంచిది. ★





కథ

ఒక వూరి కథ....

వి.శాంతిప్రబోధ

"అయ్యో... నాన్నా... ఇటు వెళ్ళమంటున్నారేం... అటు అసలు రోడ్డే లేదు'' నేను రూటు తప్పు చెప్పాననుకున్నాడేమో గాభరాగా అన్నాడు పదేళ్ళ వివేక్.

"ఇదే... మన వూరికి వెళ్ళేదారి."

"ఓహో రూరల్ ఇండియా రోడ్లు ఇలాగే వుంటాయా..?"

కారు తారు రోడ్డు వదిలి మట్టిరోడ్డుపై నెమ్మదిగా కదులుతోంది దుమ్మురేపుకుంటూ... వందగజాలు ఆ మట్టి రోడ్డులో ముందుకెళ్లి కాలువగట్టెక్కి ప్రయాణిస్తోంది ఆ ఇండికా ఏ.సి. కారు.

"వావ్... బ్యూటిఫుల్.... వెరీబ్యూటిఫుల్ లాండ్ స్కేప్ చూడు నాన్నా."

"రాస్తా అసలు మంచిగ లేదు సార్.. ఇక బండి ముందుకు పోవుడు కష్టం" అంటూ కారాపాడు డ్రైవర్.

"అయ్యో ఇప్పుడెట్లా" వివేక్ ఆందోళన.

"ఈ రాస్తాలో ఇట్లా వెళ్తే కారు ఇక పనికిరాదు. మా ఓనర్ నా జీతం ఇవ్వను కూడా ఇవ్వడు. పెద్ద పరేషాన్" అన్నాడు డ్రైవర్.

"ఇక్కడ్నుంచి మన వూరు ఎంత దూరం నాన్నా?"

"దాదాపు రెండు కిలోమీటర్లు" అని వివేక్‌తో చెప్పి, "డ్రైవర్ పోనీ.. కాస్త ముందుకెళ్తే రోడ్డు బాగుంటుందేమో" నచ్చచెప్తూ అన్నాను నేను.

"కుదరదు సార్... అసలే కాలువగట్టు. కాలువ వస్తోంది. ఎక్కడన్నా నీరు, బురద ఉంటే ఈ ఎగుడు దిగుడు రోడ్డులో కారు కూరుకుపోతుంది. అట్నుంచిగానీ, ఇట్నుంచిగానీ ఎవరన్నా వస్తే అడుగుదాం" అంటూ తన నిర్ణయాన్ని కచ్చితంగా చెప్పేడు డ్రైవర్.

"ఈ రూట్‌లో వెహికిల్స్ ఏమీ కన్పించడం లేదు. అంటే మన ఊరికి ట్రాన్స్‌పోర్టేషన్ ఫెసిలిటీ లేదా..?" చుట్టూ పరికిస్తూ అడిగాడు వివేక్.

దూరంగా పొలాల్లో వంగి పని చేసుకునే మహిళలు, ఖాళీ పొలాల్లో పశువులు మేపే కుర్రాళ్ళు తప్ప మరెవరూ కన్పించడం లేదు.

"నా చిన్నప్పుడయితే రోడ్డు లేదు. ఇప్పుడు వేశారేమో అనుకున్నా. వేసినట్లే లేరు"

"రెండు కిలోమీటర్లేనా... ఫర్వాలేదు. మనం కబుర్లు చెప్పుకుంటూ, ఈ బ్యూటిఫుల్ లాండ్‌స్కేప్‌ని ఎంజాయ్ చేస్తూ... అని "మరి మన బ్యాగేజి...?" ప్రశ్నార్థకంగా నా మొహంలోకి చూస్తూ అన్నాడు వివేక్.

"వావ్.. వండర్‌ఫుల్..!" అంటూ పచ్చని పొలాల్లోంచి పైకి లేస్తున్న కొంగల్ని చూసి ఆశ్చర్యం, ఆనందంతో వివేక్.

ఆ పక్షుల గురించి కబుర్లతో కొంత సమయం గడిచిపోయింది. ఎండ వేడిమి ఉన్నకొద్దీ పెరిగిపోతోంది. ఫిబ్రవరిలోనే ఇంతలా పెరిగిపోతోంది. జనసంచారమే లేదు. అదే ఉదయం, సాయంకాలం అయితే బడికి వెళ్ళే పిల్లలు, పశువులు-వాటి కాపరులూ, పనులకు చద్దిమూటలతో వెళ్ళే పడుచులు, ఎడ్లబండ్లు, భుజాన నాగలితో రైతన్నలూ దారంట ఎంత సందడి..!!

ఒకప్పుడు నేనూ వారిలో ఒకడినే కదా... మనసు గత స్మృతుల్లోకి వెళ్ళబోయింది.

"అబ్బ... చాలా వేడిగా ఉంది" అంటూ నా ఆలోచనలకు భంగం కల్గించిన వివేక్ కారులో కూర్చున్నాడు. ఈ ఎండ భరించడం నాకూ చాలా ఇబ్బందిగానే ఉంది. ఒకప్పుడు మండుటెండని సైతం లెక్క చేయకుండా, కనీసం చెప్పులైనా వేసుకోకుండా చెట్లూ పుట్టల్లో తిరిగేవాడినే. ఇప్పుడేమిటి ఈ మాత్రం వేడిని భరించలేకపోతోంది నా శరీరం అని ఆలోచిస్తూ నేనూ వెళ్ళి కార్లో కూర్చున్నా. డ్రైవర్ మేం కూర్చోడం చూసి ఏ.సి. ఆన్ చేశాడు.

"నాన్నా అది ఏ క్రాప్?" దూరంగా కన్పించే సన్‌ఫ్లవర్ చూపుతూ వివేక్ ప్రశ్న.

"సన్‌ఫ్లవర్" అని చెప్పి మళ్ళీ నేనే.

"ఆ ఎత్తుగడ్డ మీద వేసింది మొక్కజొన్న, ఆ గ్రీనరీలో కొంత వరిపంట – పచ్చ గడ్డి అనుకుంటాను.

"మొక్కజొన్న అంటే...?" వివేక్ సందేహం.

"కార్న్"

"ఓహో... ఏనిమల్ ఫీడ్"

"అమెరికాలో మొక్కజొన్నని ఏనిమల్ ఫీడ్‌గా వాడతారు. కానీ మన దేశంలో ప్రజల ముఖ్య ఆహారాల్లో ఒకటి. చాలా బలవర్థకమైంది."

"ఏంటి కార్న్ మనుషులు తింటారా..?" వాడిలో అంతులేని ఆశ్చర్యం.

"అవున... నా చిన్నప్పుడు మా పొలంలోనూ మొక్కజొన్న పండించేవాళ్ళం... పొలం వెళ్ళినప్పుడల్లా మొక్కజొన్న కంకులు మంటలో వేసి కాల్చుకు తినేవాళ్ళం.

అసలు ఆ టేస్టే వేరు.. ఆ రోజులే వేరు..." మళ్ళీ గతస్మృతుల్లోకి వెళ్తున్న నా ఆలోచనలకు అంతరాయం కల్గిస్తూ....

"రియల్లీ అంత టేస్టీగా వుంటాయా? అమెరికాలో ఎందుకు తినరు? నేనూ టేస్టు చూడాలి" వివేక్ ఆత్రుత.

"అంతేకాదురా... మొక్కజొన్న సీజన్‌లో వీటితో చాలా వంటలు చేసుకునే వాళ్ళం. లేత మొక్కజొన్నల్ని ఒలిచి గారెలు, బూరెలు చేసుకునే వాళ్ళం. నాకు ఈ గారెలు ఇష్టమని మా ఎదురింటి సీతమ్మ పిన్ని ఎప్పుడు వండినా నన్ను పిలిచి పెట్టేది. మా ఫ్రెండు సుధాకర్‌రెడ్డి వాళ్ళింట్లో బొగ్గుల మీద కాల్చిన కండెపైన వెన్నరాసి ఉప్పుకారం చల్లి ఇచ్చేవాళ్ళు. ఒక్కోసారి నిమ్మరసం రాసి ఉప్పు చల్లుకు తినేవాళ్ళం. ఓహ్... ఆ టేస్టే.. టేస్ట్.. మొక్కజొన్న కోసేటప్పుడు ఎక్కడైనా పచ్చిగా ఉన్న కండెలు ఉంటే వాటిని ఇంటికి తెచ్చేవాళ్ళం.. అవి నేనైతే పచ్చిగానే తినేవాడిని ఒక్కోసారి. లేదా ఉడికించుకు తినేవాళ్ళం. వర్షాకాలంలో ఎండిన మొక్కజొన్నలతో పేలాలు వేయించుకునే వాళ్ళం" మాతృభూమిలో అడుగు పెట్టగానే ప్రవాహంలా ముంచెత్తుతున్న మధురానుభూతులు.

"నాన్నా, ఈ విషయాలు నాకెప్పుడూ చెప్పలేదేం" నాకు బ్రేకు వేస్తూ ప్రశ్న.

"ఆ సమయం, సందర్భం రాలేదు..." అంటుండగానే

"నాన్నా... అటు చూడు దుమ్ము మేఘంలా లేస్తూ... ఏదో వాహనం వస్తున్నట్లుంది" వెనక్కి చూపుతూ ఉత్సాహంతో అన్నాడు వివేక్.

"ఆటో అనుకుంట సార్" డ్రైవర్.

ఎత్తు పల్లాల మట్టిరోడ్డులో అటు ఇటు ఒరిగిపోతున్న ఆటో జీవన పోరాటంలోని ఒడిదుడుకులతో నడవలేక నడుస్తున్న నిండు గర్భిణిలా.

"అయ్యో... కాలువలో పడిపోతుందేమో" వివేక్ భయపడ్డాడు.

సిటీలో అయితే ముగ్గురు, నలుగురు కంటే ఎక్కువ ఎక్కనియ్యరు. రోడ్డు, బస్సులేని ఊర్లలో ఇదే దిక్కు కద... బందుల దొడ్డిలో మందిని తోలినట్టు ఈ ఆటోల్లో తోల్తారు జనాన్ని!" అంటూ డ్రైవర్ కారు దిగి వస్తున్న ఆటో ఆపాడు.

నేనూ వివేక్ కూడా కారు దిగాం.

ఆటోలోని వాళ్ళంతా మావైపే వింతగానూ, ఆసక్తితోనూ చూస్తున్నారు. ఆటో ఆగడంతో అటూ, ఇటూ వేళ్ళాడుతున్న ప్రయాణికులు దిగి కాస్త రిలాక్స్ అవుతూ ఏదో గుసగుసలాడుకుంటున్నారు.

"సార్ మనం వెళ్ళాల్సిన ఊరు"

"తానిమడుగు" అని చెప్పగానే మా డ్రైవర్ ఆటోడ్రైవర్ దగ్గరకు వెళ్ళి మాట్లాడుతున్నాడు.

"బాబూ మీరు ఎవరింటికి వెళ్ళాలి" నలిగిపోయిన ఖద్దరు పంచె, లాల్చీ, కండువా వ్యక్తి ఆటోదిగి వచ్చి మమ్మల్ని పరిశీలనగా చూస్తూ అడిగాడు. ఆయన్ని చూస్తే బాగా పరిచయస్తుడిలానే అన్పిస్తున్నా ఎవరైందీ పోల్చుకోలేకపోతూ జవాబిచ్చాను.

"వార్నీ... నువ్వట్రా బుల్లెబ్బాయ్...? ఎంతగా ఎదిగిపోయావ్? మారిపోయావ్? అసలు ఆనవాలు పట్టలేకపోయానంటే నమ్ము అంటూ ఆనందంతో నన్ను పట్టుకుని ఊపేశాడు. వెంటనే నా పక్కనున్న వివేక్‌ని చూస్తూ.

'నీ కొడుకా...? రంగు తప్ప అంతా తాత సీతారామయ్య..." వాడి భుజం చరుస్తూ అన్నాడు.

"ఎన్నాళ్ళకు గుర్తొచ్చిందిరా మనూరు...?" కొద్దిగా నిష్ఠూరం ధ్వనింపచేస్తూ గలగల మాట్లాడేస్తున్న ఆయన మా పక్కింటి మాధవరావు మామయ్య. నా కన్నతల్లికి వరుసకు అన్న, స్వాతంత్ర్య సమర యోధుడు. ఆనాటికీ ఈనాటికీ అదే ఖద్దరు.. అదే మాట తీరు... అదే చూపు... నిశితమైన చూపు.

"అయాం సారీ మావయ్యా... వెంటనే గుర్తు పట్టలేకపోయాను... అయినా అంత ముసలైపోయారేంటి?" అన్నాను నొచ్చుకుంటూ...

"ఆ... ఊరు పొమ్మంటోంది.. కాదు రమ్మంటోంది" వయసు మీద పడ్తోంటే ముసలి వాళ్ళ కామ్రేడ అబ్బాయ్" అని ఊరొదిలి పాతికేళ్ళు దాటినా బాగానే గుర్తు పట్టావే మెచ్చుకోలుగా అని

ఇదేనా రాక... ఎప్పుడు దిగావ్ ఇండియాలో... ప్రశ్నల వర్షం కురిపిస్తూ... ఎంతో ఆప్యాయంగా, అభిమానంగా పలకరించాడు.

"సార్ ఇంకా ముందుకెళ్తే రోడ్డు అస్సలు బాగోలేదు. మన కారు పోదట. ఈ గిరాకీని దింపి వచ్చి మిమ్మల్ని తీసుకెళ్తానన్నాడు" చెప్పాడు మా డ్రైవర్.

ఒరేయ్... కేవళ్యా... ముందు వాళ్ళందర్నీ దింపు. ఆ తర్వాత ట్రిప్పులో వస్తార్లే... వీళ్ళెవరో గుర్తు పట్టావా...? సీతారామయ్యగారి అబ్బాయి. అమెరికా నుండి వస్తున్నాడు" నన్ను చూపుతూ చెప్పడంతో ఆటోలో కూర్చున్న వాళ్ళంతా దిగిపోయారు.

"మీరలా నాలుగడుగులేసే సరికి మీ ముందుంటుంది ఆటో అని వాళ్ళకు సర్దిచెప్తూ ఆటోలో మా సామాను డ్రైవర్ సాయంతో సర్దేశాడు మామయ్య... అరె... వద్దు మామయ్యా... వాళ్ళని దింపి వచ్చి తీసుకెళ్తారు" అంటే ఒప్పుకోకుండా నన్ను ఇబ్బంది పెట్టేశారు. ఇక ఆటో ఎక్కక తప్పలేదు.

"నాన్నా ఈ కాలువలో నీళ్ళు ఇంత మురికిగా వున్నాయేం?" వివేక్ సందేహం.

"కాలువ ఈ రోజే వదిలారు అందుకే చెత్తా చెదారంతో మురికిగా వున్నాయి. ఎలక్షన్లు దగ్గర్లో ఉన్నాయి కదా... అందుకే వదిలారు నీళ్ళు. పోయినేడాది ఈ సీజన్‌లో తాగునీటికి, సాగునీటికి కటకటలాడిపోయాం. ఎక్కడిపొలాలక్కడే ఎండిపోయాయి. బోర్లు కూడా ఇంకిపోయాయి. మనూర్లో మంచినీళ్ళ బాటిల్స్ కొనుక్కున్నామంటే పరిస్థితి అర్థం చేసుకో... ఎలక్షన్లు ఏమోగానీ మనూరికి మంచినీటి సమస్య ఈ ఏడాదికి తీరినట్టే" అని మాతో చెప్పి మళ్ళీ ఆయనే 'ఒరే అబ్బాయ్... మీ నాన్న చిన్నప్పుడు ఈ కాలువలోనే ఈతకొట్టేవాడు. బడి నుంచి వచ్చేప్పుడు, వెళ్ళేప్పుడు కాలువగట్టుమీద వెళ్ళే వాళ్ళతో పందెం వేసుకొని మరీ ఈదేవాడు. ఒక్కోసారి బడి ఎగ్గొట్టేవాడు."

"మరి నాన్న స్కూల్ బాగ్" మధ్యలో వివేక్ సందేహం.

"అప్పట్లో ఎడ్లబండ్లు ఈ దారివెంట బాగా ఉండేవి. ఏదో ఒక ఎడ్ల బండి కన్పిస్తే దానికి బ్యాగు, బట్టలు తగిలించే వాళ్ళు. తడి బట్టలతో ఇంటికెళ్తే మీ తాతయ్య తంతారని ఊరు మొదట్లో ఒడ్డు కెళ్ళి బట్టలు వేసుకొచ్చేవాడు మీ నాన్న. ఎంత బుద్ధిమంతుడిలా వచ్చినా విషయం మీ తాతయ్యకు తెలిసిందంటే తాట ఒలిచేవాడు" అంటూ భళ్ళున నవ్వేశారు మావయ్య. ఆయన చెప్పే మాటలు ఎంతో ఆసక్తిగా వింటూ మధ్య మధ్య నాకేసి చిలిపిగా చూస్తున్నాడు వివేక్.

ఆటో అటూ ఇటూ వంగిపోవడం చూస్తే కాలువలో పడిపోతుందేమోనని పిస్తోంది. ఆ కుదుపుకు ఒళ్ళు హూనం అవుతోంది. ఇప్పటికంటే పాతికేళ్ళనాటి దారే బాగుంది. హైదరాబాద్ రోడ్లు, ఫ్లైవర్‌లు చూసి ఈ రోడ్లు బాగుంటాయని ఊహించాను. కానీ పల్లెల్లో పరిస్థితి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంలా ఉందే... స్వగతంలో మాటలు పైకి వచ్చేశాయి

"పరాయి పాలన మా కొద్దు అంటూ ఆనాడు పోరాటాలు చేశాం. దేశ స్వాతంత్ర్యం సాధించుకున్నాం. మళ్ళీ ఇప్పుడు దేశ అభివృద్ధి పేరుతో సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని పరాయివాళ్ళకు తాకట్టుపెడ్తున్నాం. ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేసుకుంటూ వాళ్ళకు దాసోహం అంటున్నాం..." ఆయన ఏం చెప్తున్నారో అర్థం కావడం లేదు. ఎక్కడికో వెళ్ళిపోతున్నారేవిటి అ మనసులో నేను.

"మనకు అప్పిచ్చే ప్రపంచ బ్యాంకు చేతిల మన పాలకులు కీలుబొమ్మలు. మన అవసరాల్ని మన అనుగుణంగా తీర్చుకోవాల్సింది పోయి వాళ్ళు చెప్పి అవసరాల్ని మనం తీర్చుకుంటున్నాం. అంటే అందుల భాగంగానే నగరాల్లో తళతళ లాడిపోయే రోడ్లు... వేసిన మళ్ళీ మళ్ళీ వేస్తూ... గ్రామాలకు నాసిరకం రోడ్లు ఉం లేకుండా పోయిన ఏడాదికే అధ్వానంగా తయారవుతున్నాయి పల్లెలపై మన పాలకులది సవతి తల్లి ప్రేమ చెప్పుకుపోతున్నారాయన ప్రవాహంలా. సవతి తల్లి... సవ తల్లి... ఆమె వల్లే కదా... తను ఇంటికీ... తన వాళ్ళందరి దూరమైంది. నా చుట్టూ నేను ఒక చట్రం బిగించుకొ అందులోనే ఉండిపోయింది. ఆమె మీద కసితో కోపంతోనే కదా... పుస్తకాల పురుగుగా మారిపోయింది చివరికి ఈ స్థితికి చేరింది. తను ఆమె మీద క చూపిస్తున్నాననుకున్నా అది తన ఉన్నతికి బాటవేసింది లేకపోతే ఎలా ఉండేవాడినో....? ఏం చేసేవాడినో. బహుశ... నాన్న చెప్పినట్లు వ్యవసాయం చేస్తూనో, లే ఏదో కంపెనీలో గుమాస్తా గిరీ వెలగబెడ్తూనో...!

ఇప్పుడెలా ఉందో ఆమె... అదిగో అమ్మ. నన్ను అలక్ష్యం చేసిందనీ, కన్నతండ్రికి దూరం చేసింద ఆమె అంటే నాకెంతో కసి. అసలు మాట్లాడే వాడినే కాద కానీ ఇప్పుడు ఆలోచించిన కొద్దీ తన ఉన్నతికి పరోక్షం ఆవిడే కారణం అని తెలుస్తోంది. ఈ రియలైజేష ప్రారంభమైన దగ్గర్నుంచి ఎప్పుడెప్పుడు తన ఊ వెళ్ళాలా... అమ్మను చూడాలా అని ఆదుర్దా... సమ్మర్ వెళ్దామని నా భార్య అంటున్నా ఆగలేక వెంటనే ఈ ప్రయాణం.

నా రాక అమ్మకి అంతులే ఆశ్చర్యాన్నిస్తుంది. ఆనందాన్నిస్తుంది.... ఆలోచన అమ్మచుట్టూ తిరుగుతున్నాయి. "బుల్లెబ్బాయ్, నీ రా గురించి మీ అమ్మ మాటవరసకైనా అనలేదే"

''అమ్మకి తెలీదు మామయ్యా. అప్పటికప్పుడు బయలుదేరాం."

''నిన్ను చూస్తే ఆవిడెం సంబరపడిపోతుందో... మీ నాన్న ఉన్నన్ని రోజులు నీకో కలవరించే వారు. నిన్ను చూడాలని తపించిపోయేవా ఫ్... వెళ్ళిపోయాడు మహానుభావుడు. నువ్వు రెండుసా మన దేశం వచ్చి కూడా ఇంటికి రాలేదని చా బాధపడ్డాడు. కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. నా మే వాడికెందుకో ఇంత కోపం. వాడి మంచికోసమే కదా నే ఏం చేసినా... అది వాడెప్పుడు అర్థం చేసుకుంటాడో అ ఆవేదనతోనే పోయాడాయన.." చెప్పుకుపోతున్నా మామయ్య.

మా ఇద్దరినీ గమనిస్తూ, మా మాట వింటూ పరిసరాల్ని పరికిస్తున్నాడు వివేక్.

ప్చ్... ఇప్పుడనుకుని ఏం లాభం! మొండితనంతో, మూర్ఖపు పట్టుదలతో, ప్రవర్తన కన్నతండ్రిని ఎంతో బాధపెట్టాను. నా ఉజ్వల భవిష కోసం రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడిన ఆయన మనోవ్యథకు గురి చేశాను. కనీసం ఆయన కర్మకాండల

(మిగతా 15వ పేజీలో)

ఎంత సంపాదించినా ఏం లాభం?

అంపశయ్య నవీన్

"నమస్కారం సార్!"

"నమస్కారం... నమస్కారం... ఏమిటోయ్ రామలింగం! బాగున్నావా?"

"మీదయవల్ల బాగానే వున్నాను సార్!"

"నా దయేముంది? ఆ దేవుడి దయ వల్ల బాగున్నాను అనాలి"

"దేవుని దయదేముంది సార్... మీలాంటి వాళ్ళ దయే మాలాంటి వాళ్ళకు కావాలి."

"అదేమిటి... మీలాంటి వాళ్ళు అంటున్నావు. అది తిట్టడమా? మెచ్చుకోవడమా?"

"మిమ్మల్ని తిట్టి మేం బతగ్గలమా సార్?"

"మమ్మల్ని మరీ అంత ఎక్కువ చేసి మాట్లాడకు... ఇవ్వాళ్ళ రేపు మమ్మల్ని తిట్టని వాడెవ్వడున్నాడు? తిట్టి బతకని వాళ్ళెవరున్నారు?..."

"అలా అనకండి సార్.. మీలాంటి రాజకీయ నాయకులను తక్కువ అంచనా వెయ్యకూడదు. మీతో జాగ్రత్తగానే మసలుకోవాలి."

"ఎందుకుట?"

"మీరు ఏ క్షణంలో ఏమైతారో తెలీదుగదా."

"అంటే?..."

"ఇవ్వాళ్ళ ఈ పార్టీలో వున్నారు... రేపు ఏ పార్టీలో కెళ్తారో తెలీదు.. ఇవ్వాళ్ళ మామూలు కార్యకర్తగా ఉన్నారు. రేపు మంత్రి అయిపోతారు."

"అంటే?"...."

"ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలో ఉన్నారా?

"అవును..."

"ఎం.ఎల్.ఏ.గా పోటీ చెయ్యడానికి టికెట్ వస్తుందని ఆశిస్తున్నారా?"

"అవును...."

"టికెట్ రాలేదు అనుకోండి... అధికార పార్టీలోకి దూకేస్తారు కదా..."

"ఈ సంగతి నీకెలా తెలిసిందోయ్..."

"తెలియలేదు సార్... ఊహిస్తున్నానంతే..."

"ఊహిస్తున్నావా? అయితే నీ ఊహ నిజం కాకపోవచ్చు."

"ఎందుకు?"

"నాకు నా పార్టీ వాళ్ళే టికెటిస్తారు. పాతికేళ్ళుగా నేను ఈ పార్టీనే నమ్ముకొని ఈ పార్టీకే నా శక్తియుక్తులన్నీ ధారపోశాను. నాకు టికెటియ్యకపోతే ఇంకెవరికిస్తారు?"

"సారీ సార్... మీకు మీ పార్టీ వాళ్ళు టికెటివ్వడం లేదని మాకు కచ్చితమైన సమాచారమొచ్చింది."

"మీరు జర్నలిస్టులు గదా... చాలా విషయాలు మా కన్నా ముందు మీకే తెలుస్తాయి... అయితే నాకు మా పార్టీ వాళ్ళు టికెట్ ఇవ్వడం లేదా? నాకు గాక మరెవరికిస్తారట!"

"మొన్న అధికార పార్టీలోంచి మీ పార్టీలోకి దూకాడే, ఆ రామగోని నారాయణ, ఆయనకిస్తున్నారని అభిజ్ఞవర్గాల భోగట్టా?"

"నన్ను కాదని నిన్నగాక మొన్న మా పార్టీలోకొచ్చిన - నారాయణకిస్తారట్నా? మా పార్టీకిక మా నియోజకవర్గంలో పుట్టగతులుండవు"

"పాతికేళ్ళుగా మీ శక్తియుక్తులన్నీ ధారపోసి, పెంచి పోషించిన పార్టీకి ఇలా శాపనార్థాలు పెట్టొచ్చాసార్? ఎందుకు పెట్టొద్దు... నన్ను కాదని వాడెవ్వడికో టికెటిస్తారా? ఇస్తే నేనూరుకుంటాననుకున్నారా?"

"ఏం చేస్తారు సార్"

"నేను అధికార పార్టీలోకి దూకుతా..."

"ఇప్పుడు దూకితే కాలోచెయ్యో విరగ్గొట్టుకుంటారు తప్ప, పెద్దప్రయోజనం ఉండదేమో సార్!"

"ఎందుకంటారు?"

"ఆల్‌రెడీ చాలా మంది... మీ కంటే పేరున్నవాళ్ళూ, హోదా వున్న వాళ్ళూ ఆ పార్టీలోకి దూకేశారు సార్..."

"వాళ్ళూ నాకు టికెటివ్వరంటారా?"

"ఇవ్వకపోవచ్చుననే నా ఊహ...."

"మీ ఊహకు అధారమేమిటి?"

"ఆల్‌రెడీ మీ కన్నా ముందే దూకేసిన మరో అభ్యర్థికి టికెట్ ఖాయమైపోయిందట..."

"వాడు నాకన్నా ఎక్కువ డబ్బున్న వాడు కాబట్టి మీ ఊహనిజమే కావచ్చు."

"ఇప్పుడు మీరేం చేస్తారు సార్?"

"ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తా"

"ఇప్పుడు ప్రజలు ఇదివరకటిలా ఇండిపెండెంట్లను గెలిపించడం లేదు సార్..."

"నాకు నేను గెలవడం ముఖ్యం కాదు... నన్ను కాదని మా పార్టీ వాళ్ళు ఇంకెవడికో టికెటిస్తున్నారే... వాడిని ఓడించాలె... అదీ నాకు కావల్సింది"

"మీరు పాతికేళ్ళుగా పెంచి పోషించిన మీ పార్టీ అభ్యర్థిని మీరే ఓడిస్తారా సార్? మీ వేలితో మీ కంటినే పొడుచుకుంటారా సార్!"

"వాళ్ళు నా కంటిని పొడిచినప్పుడు నేను వాళ్ళ కంటిని పొడవక తప్పదు కదా! అసలు బుద్ధున్నవాడెవ్వడూ రాజకీయాల్లోకి రావద్దోయ్..."

"ఎందుకుసార్... సడన్‌గా అంతమాటన్నారు?"

"రాజకీయాల్లోకొచ్చిన వాడెవ్వడూ సుఖపడడోయ్! లేచింది మొదలు మళ్ళీ పడుకునే దాకా... అసలు మేం పడుకునేదెప్పుడని? 24 గంటలూ కాలికి బలపం కట్టుకుని తిరగడమే తిరగడం... పెళ్ళాం లేదు... పిల్లల్లేరు... ఎప్పుడూ ప్రజాసేవేనాయె! తెల్లకార్డు ఇప్పించమని ఒకడొస్తాడు... పోలీసులు పట్టుకపోయిన నా కొడుకును విడిపించండని ఒకడొస్తాడు... నా కొడుక్కు ఉద్యోగమిప్పించండని ఒకడొస్తాడు. మా వాడికి మంచినీళ్ళ పైపులు శాంక్షన్ చేయించండని ఒకడొస్తాడు. మాకు కరంటొస్తలేదని ఒకడొస్తాడు. అందరికీ వాగ్దానాలు చేసేస్తాం... అధికారులకు ఫోన్లు చేస్తాం. ఎవడ్నీ కాదనటానికి వీల్లేదాయె... రేపు వాడితో అవసరముంటుంది కదా! వాడికి ఓటుంది కదా. ఎవడ్ని నొప్పించినా రేపు వాని ఓటు పడదనే భయం మమ్మల్ని వెంటాడుతూనే వుంటుందాయె! నిద్రాహారాలు మానేసి ఎప్పుడూ జనంతోటే ఉండాలాయె... మేమేదో బాగా పైరవీలు చేసి బాగా సంపాదించుకుంటున్నామను కుంటారు మీరు. కానీ ఏం లాభం! ఇవ్వాళ్ళ ఓ కోటి సంపాదిస్తే రేపు ఎన్నికలల్ల రెండు కోట్లు ఖర్చు పెడ్తాం..." ★

మేకల మదన్‌మోహన్‌రావు

భూతవైద్యుడు - మొసలి మందు

ఒకానొక ఊరిలో ఓ వేటగాడు వున్నాడు. ఒక రోజు గాఢ నిద్రలో వుండగా అతనికి ఒక కల వచ్చింది. అందులో..భయంకరమైన మొసలి ఒకటి నది ఒడ్డున వున్న వేటగాడి కాలు పట్టుకొని నీళ్లలోకి లాక్కెళ్లింది. అంతే... అతను కెవ్వుమని అరుస్తూ నిద్ర లేచాడు. చుట్టూ చూస్తే... తాను తన గుడిసెలోనే వున్నాడు. ఆ తర్వాత ఎంత ప్రయత్నించినా నిద్ర పోలేకపోయాడు. భూత వైద్యుడి దగ్గర ఏదైనా ఔషధం తీసుకుంటే మొసలి భయం పోతుందని తనకు తానే ధైర్యం చెప్పకున్నాడు.

పొద్దున్నే భూత వైద్యుడు నివసించే గుడిసె దగ్గరకు వెళ్లాడు. తనకొచ్చిన కల గురించి అతనికి చెప్పాడు. 'ఏ మొసలీ నా జోలికి రాకుండా ఏదైనా మంచి ఔషధాన్ని ఇచ్చి నన్ను కాపాడండి' అని మొర పెట్టుకున్నాడు దీనంగా.

మాంత్రికుడు ఓసారి తన తల తడుముకుని, "సరే మంచిది. అది అంత సులభం కాదు. కానీ ప్రయత్నిస్తా. ఔషధం ఇవ్వాలంటే చాలా ఖర్చవుతుంది. నీ దగ్గర అంత డబ్బుందా?" అని అడిగాడు.

"వంద రూపాయల వరకైతే ఫర్వాలేదు. ఆ మందు తీసుకుంటా. ఆ కల నన్ను అంత హడలగొట్టింది" అన్నాడు వేటగాడు.

"ఆ మందు ధర వంద రూపాయలే. ఇలా ఇవ్వు" అన్నాడు మాంత్రికుడు.

వేటగాడు ఇచ్చిన వంద రూపాయలు తీసుకుని గుడిసె లోపలికి వెళ్లాడు. మురికి కంపుగొడుతున్న ఒక సంచితో బైటికి వచ్చాడు.

"ఈ సంచిలో నీ తల దూర్చి వున్నంతసేపు నువ్వు సురక్షితంగా వుంటావు. ఇది చాలా దివ్యమైన ఔషధం. ఇది మొసలి దంతం, గండభేరుండ పక్షి రెక్క, కుందేలు పాదం... ఇంకా నీకు చెప్పకూడని వివిధ వస్తువులతో తయారయ్యింది" అన్నాడు.

వేటగాడు పరమానందంతో ఆ సంచిలో తలదూర్చి, తన విల్లు, గొడ్డలి చేతికి తీసుకున్నాడు.

"కృతజ్ఞతలు. నేను నిర్భయంగా వేటకు వెళ్తాను. ఇక నాకు మొసళ్లంటే ఏం భయంలేదు. వాటినుండి రక్షించడానికి ఈ దివ్య సంచి వుందిగా" అంటూ పోబోయాడు.

మాంత్రికుడు అతణ్ణి వారించి, "ఒక్క క్షణం ఆగు. వెళ్లటానికి ముందు నువ్వు తెలుసుకోవాల్సిన సంగతి ఒకటుంది. ఈ దేశంలో ఏ భూత వైద్యుడూ నీ తల చుట్టూ వున్న సంచికన్నా మంచి ఔషధాన్ని తయారు చేయలేడు. అయితే నువ్వు ఎప్పడూ నీటి దగ్గరకు వెళ్లకూడదు. నీళ్లు ఈ సంచికున్న అద్భుత శక్తిని హరించి వేస్తాయి. నువ్వు నీటికి దూరంగా వున్నంత కాలమే ఈ సంచి నిన్ను మొసళ్ల బారి నుండి రక్షిస్తుంది" అన్నాడు.

"కానీ మొసళ్ళు నీటిలోనే కదా వుండేది. నేను నీటి దగ్గరకే వెళ్లనప్పుడు మొసళ్ల బారినపడే అవకాశమే లేదు కదా?" అని తన సందేహాన్ని వెలిబుచ్చాడు వేటగాడు.

"నిజమే. అలాంటప్పుడు అవి నిన్ను చూడలేవు" అన్నాడు భూతవైద్యుడు తల పంకిస్తూ.

"నేను నీళ్ల దగ్గరికే వెళ్లనప్పుడు ఈ అద్భుత ఔషధ సంచి లేకున్నా నేను మొసళ్ల బారిన పడను కదా? అంటే నేను ఉత్తిపుణ్యానికే నీకు వంద రూపాయలు ఇచ్చానన్న మాట" ఏడుపు గొంతుతో అన్నాడు వేటగాడు.

"ఇదిగో. నువ్వు ఎక్కువగా ఆలోచిస్తున్నావ్. ఇలా అయితే చాలా కష్టాలు పడాల్సొస్తుంది. మర్యాదగా ఇక్కడినుంచి పో" కోపంగా అంటూ వైద్యుడు తన గుడిసెలోకి వెళ్లి తలుపు గడియ పెట్టుకున్నాడు.

భూతవైద్యుడి దగ్గర మంత్రాలేవీ లేవని, తనను మోసం చేయడానికే వందరూపాయలు తీసుకుని ఆ మురికి సంచిని అంటగట్టాడని వేటగాడికి అప్పుడు అర్థమైంది. మోసపోయినందుకు విచారిస్తూ మరెప్పడూ మంత్రగాళ్లను నమ్మకూడదనుకున్నాడు.



ఏది పెద్దది?



మేజిక్! మేజిక్!!

హాయ్! ఏంటి? పదో తరగతి చిన్నారులకు బోరుగా వున్నట్టుంది. పరీక్షలై పోయాయికదా. అందుకేనా. సరే. కాసేపు మీ బుర్రకు పని పెడదామనుకుంటున్నాం. పెట్టమంటారా? అయితే రెడీ అవ్వండి. పైన రెండు బొమ్మలున్నాయికదా. వాటి ప్రత్యేకత ఏంటో చెప్పకోండి. 'ఏముంది? సున్నాలతో రెండు పూలు వేశారు. అంతేకదా' అంటున్నారు కొందరు చిన్నారులు. ఓకే. ఇంత వరకు సరిగ్గానే చెప్పారు. అసలు కష్టమైన ప్రశ్న ఇప్పుడు వేస్తాం. అదేంటంటే... ఆ రెండు పూల మధ్యలో రెండు సున్నాలు వున్నాయికదా. వాటిలో ఏది పెద్దది? బాగా చూసి, ఆలోచించుకుని చెప్పండి. తొందరేం లేదు. 'ఆ... దీనికి ఒక ఆలోచన, బాగా చూడ్డమూనా! పెద్ద సున్నాల మధ్యలో వున్న సున్నానే పెద్దది. మేం చెప్పిందే సరైన జవాబు' అంటున్నారు నేస్తాలంతా. కానీ మీరంతా పప్పులో కాలేశారుగా. అర్రే! అలా కోపంగా చూడకండర్రా. మీరు మరోసారి ప్రయత్నించి చూడండి. అయినా మాకెందుకులెండి. మనమీద మనకు నమ్మకం వుండొచ్చుగానీ. అంత అతిగా వుండకూడదు. మీరు ఒకసారి ఆ రెండు సున్నాల వ్యాసార్థాన్ని కొలిచి చూడండి. 'అవును. మీరు చెప్పిందే కరెక్టు' అంటున్నారు చిన్నారులంతా. సరే. వచ్చేవారం మరో మాంచి మేజిక్‌తో మీ ముందుకు వస్తాం.

చిన్నారి చిత్రకారులు



కె.శ్రీఅనూహ్య,
5వ తరగతి,
ఎస్.వి.బి.కె,
గుంటూరు.



బి.ఉదయప్రక
7వ తరగ
ప్రగతిబాలవిద్యా
సుందరయ్య
తాడేపల్లి



జె.జ్ఞానేశ్వర్, 1వ తరగతి,
ఎస్.ఆర్.లైఫ్‌లైన్ స్కూల్,
బీరంగూడ,
భ్రమరాంబికానగర్.



జి.సనత్,
5వ తరగతి,
వాచస్పతి విద్యాలయం,
యర్రగొండపాలెం,
ప్రకాశం.

రంగులు వేద్దామా!



క్విజ్-3

1. గోధుమ ఎక్కువగా ఏ రాష్ట్రంలో పండుతుంది?
ఎ. పంజాబ్ బి. ఆంధ్రప్రదేశ్

2. ఐక్యరాజ్యసమితికి ముందున్న అంతర్జాతీయ సంస్థ ఏది?
ఎ. నానాజాతిసమితి బి. యునిసెఫ్

3. క్షయవ్యాధిని నిరోధించడానికి వాడేది?
ఎ.బి.సి.జి
బి.డి.పి.టి

4. వడదెబ్బ ఏ నెలలో తగులుతుంది?
ఎ.జనవరి బి. మే

5. అరికాళ్లలో వెంట్రుకలు వుండే జంతువు?
ఎ. ఒంటె బి.ధృవపు ఎలుగుబంటు

6. 'ఎంకి పాటలు' రాసినదెవరు?
ఎ.నండూరి సుబ్బారావు బి. అడవి బాపిరాజు

7. 'జాతిపిత' అని పిలుచుకునేది?
ఎ. నెహ్రూ బి.గాంధీజీ

8. కులీకుతుబ్‌షా దీనిని నిర్మించాడు?
ఎ. చార్మినార్
బి. తాజ్‌మహల్

9. ఓనమ్ పండుగ జరుపుకునే రాష్ట్రం?
ఎ. కాశ్మీర్
బి. కేరళ

10. ఈ ఫొటోలోని వ్యక్తి ఎవరు?
ఎ.సెహవాగ్ బి. బాలాజీ

క్విజ్ 2కు జవాబులు

1. గానకోకిల 2. ఎన్నిసార్లయినా 3. న్యూటన్ మూడవ సూత్రం 4. ఆఫ్రికా 5. నల్లబల్ల 6. హిమాలయాలు 7. భూమి 8. అల్లసాని పెద్దన 9. కాయ ధాన్యాలు 10. అంబేద్కర్

క్విజ్ 1కి సరైన సమాధానాలు రాసిన వారు :

కె.ఎన్.దేవికుమార్, 7వ తరగతి, **జయమంగళ అనురాధ**, 7వ తరగతి, **పొదిలి శివనాగజ్యోతి**, 7వ తరగతి, శారదావికాస్, కృష్ణా. **పెంటకోట అమర్ జయసింహ**, గవరపాలెం, అనకాపల్లి. **పి.మల్లికార్జునరావు**, 9వ తరగతి, రెంటచింతల, గుంటూరు. **డి.భాస్కర్**, 9వ తరగతి, గోనెగండ్ల, కర్నూల్.



కలం స్నేహం

పేరు: పి.దత్తాత్రి,
వయసు : 15 సం॥
చదువు :10వ తరగతి
హాబీలు : చదువుకోవడం, క్రికెట్ ఆడడం.
పూర్తి చిరునామా: పి.దత్తాత్రి,10వ తరగతి, శ్రీ నాగభూషణ గురుకుల విద్యాలయం, బాసర, ముదోల్, ఆదిలాబాద్-504101.

పేరు: సిహెచ్.రమేష్ బాబు,
వయసు : 17 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు :ప్రజాశక్తి పేపరు, కథలు చదవడం, టీవీ చూడడం.
పూర్తి చిరునామా : సిహెచ్.రమేష్ బాబు, సన్నాఫ్ మోహన్‌రావ్, మట్రేల, విన్నన్నపేట, కృష్ణా-521227.



నక్క-నగారా

పంచతంత్ర కథలు

ఓ అడవిలో ఒక నక్క వుంది. ఆహారంకోసం ఎంత వెతికినా ఏమీ దొరకలేదు. అటు తిరిగి ఇటు తిరిగి యుద్ధభూమికి చేరింది. అక్కడ మనుష్యులు, ఏనుగులు, గుర్రాల కళేబరాలు కుప్పలు కుప్పలుగా కనిపించాయి. వాటిని చూసి నక్క సంతోషంతో ఎగరబోయింది. అంతలో దానికి పెద్ద శబ్దం వినిపించింది. అంతే కళ్లు తిరిగి పడిపోయింది. కాసేపటికి మెలకువ వచ్చింది. లేచి చూసేసరికి కింద పడివున్న నగారా కనిపించింది. దానికి చెట్టుకొమ్మలు తగిలి శబ్దం అవుతోంది. అప్పుడు ధైర్యం తెచ్చుకుంది. నగారాను చీల్చి లోపలకు వెళ్లి వచ్చింది. అది యుద్ధంలో మోగించే నగారా అని దానికి గుర్తొచ్చింది. ఆ తర్వాత మెల్లగా కళేబరాలను కడుపునిండా తింది.

దమనకుడు ఈ కథ చెప్పి 'అంచేత మహారాజా! శబ్దం పెద్దగా వుందని భయపడవలసిన పనిలేదు. అది వచ్చిన దగ్గరకు వెళ్లి అసలు విషయం తెలుసుకుని వస్తాను. మీరు ధైర్యంగా వుండండి' అంటూ అక్కడినుంచి బయలుదేరి సంజీవకుని దగ్గరకు వెళ్లాడు.

'నేను ఈ అడవికి రాజు పింగళకుడి సేవకుడిని. నీ అరుపు ఆయనకు చికాకు కలిగించిందంట. ఆయన నిన్ను శిక్షించాలనుకుంటున్నాడు. ఆయన నిన్ను చంపకముందే కాళ్లమీద పడి కాపాడమని కోరుకో. బతికిపోతావు. అలా చెయ్యాలనుకుంటే నా వెంటరా. మా రాజుగారికి ఏదోవిధంగా చెప్పి నీమీద కోపం లేకుండా చేస్తాను' అన్నాడు దమనకుడు. సంజీవకుడు సరేనంటూ అతని వెంట బయలుదేరాడు.

ఇరువురూ పింగళకుడి దగ్గరకు చేరారు. 'మహారాజా! మిమ్మల్ని భయపెట్టేంత శబ్దం చేసిన వృషభరాజు ఈ సంజీవకుడే. ఇతనికి మాంచి తెలివి వుంది. మీకు మంత్రి కాదగిన వాడు' అన్నాడు దమనకుడు. సంజీవకుడు పింగళకునికి నమస్కరించాడు. 'పింగళక రాజా! మీ అనుమతి లేకుండా ఈ అడవిలోకి ప్రవేశించాను. నన్ను క్షమించండి' అన్నాడు. అప్పుడు పింగళకుడు గొప్పగా ఫోజు పెట్టి 'నేను మీ గొప్పతనం గురించి విన్నాను. ఇవాల్టి నుంచి మిమ్మల్ని నా మంత్రిగా నియమిస్తున్నాను' అన్నాడు.

ఇక ఆ రోజు నుంచి పింగళకుడు, సంజీవకుల స్నేహం రోజు రోజుకీ పెరిగింది. మృగరాజు మెప్పు పొంది మంత్రి పదవి సంపాదించాలనుకున్నాడు దమనకుడు. కానీ ఆ పదవి సంజీవకుడికి దక్కడంతో లోలోన బాధపడసాగాడు. అలా విచారంగా వున్న దమనకుడిని చూశాడు కరటకుడు.

'తమ్ముడూ దమనకా! అలా నీరసంగా బాధగా కనపడుతున్నావేంటి?' అని అడిగి అంతా తెలుసుకున్నాడు.

'దీనికి అంత విచారించడమెందుకు? అసలు మనకు ఈ పెత్తనాలు ఎందుకంటే విన్నావుకాదు. ఇందులో తప్పంతా నీదే' అంటూ దమనకుడిని సున్నితంగా మందలించాడు కరటకుడు.

'కరటకా! నీవు చెప్పింది నిజం. దూరాలోచన చేయకుండా పొరపాటు చేశాను. ఇలా నా ఒక్కడికే కాదు ఆషాఢభూతి అనేవాడి చేతిలో ఒక సన్యాసి, పొట్టేళ్ల పోట్లాటలో ఒక నక్క, డబ్బుతోపాటు ప్రాణాలు కోల్పోయాయి. ఆ కథ చెప్తాను విను' అంటూ దమనకుడు చెప్పడం మొదలెట్టాడు.



వికలాంగ వార్తాపు(ప)త్రిక

పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

సంగీత విభావరి ప్రారంభమైంది.

నిపుణులైన కళాకారులు వాద్య పరికరాలతో వేదికమీద కూర్చుని ఉన్నారు. నలుగురు గాయకులు పాటలు పాడుతూ తమ గాన మాధుర్యంతో ప్రేక్షకుల్ని ఓలలాడిస్తున్నారు.

ఆడిటోరియం అంతా రనజ్ఞులతో నిండిపోయింది.

సంగీతం తోడై వీనుల విందైన పాటలు గాలిలో అలలు అలలుగా తేలి వస్తుంటే ప్రేక్షకులు ఆనందంతో కేరింతలు కొడుతున్నారు. కొన్ని పాటలను వన్స్‌మోర్ అంటూ మళ్ళీ మళ్ళీ పాడించుకుంటున్నారు.

రాఘవన్ ఓ మూల కూర్చున్నాడు.

పక్కన పదేళ్ళ కూతురు జయశ్రీ కూడా ఉంది.

పాటలు పాడుతున్న వారిని, పాటలు వింటూ ఆనందంగా స్పందిస్తున్న ప్రేక్షకుల్ని వింతగా చూస్తోంది. పాట పూర్తయిన తర్వాత కరతాళ ధ్వనులు హోరెత్తిస్తుంటే తాను కూడా రెండు చేతులు కలిపి చప్పట్లు కొడుతోంది.

పాటలు అర్థం కాకపోయినా... సంగీత వాయిద్యాల హోరు తెలియకపోయినా ఆమెలో సహజ సిద్ధమైన కుతూహలం మాత్రం పోలేదు. తండ్రి రాఘవన్‌ను ఒక్కొక్క విషయం అడిగి అతను చెప్పే సమాధానాన్ని పెదవుల కదలిక ఆధారంగా అర్థం చేసుకుంటోంది.

వినికిడి సమస్యతో జయశ్రీ చిన్నతనం నుంచీ బాధపడుతోంది. ఎంతమందికి చూపించినా ఫలితం లేదని చేతులు ఎత్తేశారు. అప్పటి నుంచి ఇతరుల మాటలను వారి పెదవుల కదలికల ఆధారంగా అర్థం చేసుకోగలుగుతోంది. చిన్న పుస్తకం పెన్ను చేతితో పట్టుకుని ఎవరితో మాట్లాడినా తిరిగి సమాధానం రాయడానికి పుస్తకం అందించేది. ఇంతలో హాలులోకి పదిమంది పిల్లలు ప్రవేశించారు. ఒకరి చేయి ఒకరు పట్టుకుని తడుముకుంటూ లోపలికి రావడంతో నిర్వాహకులు వారికి ముందు వరుసలో సీట్లు చూపించి కూర్చోబెట్టారు.

సంగీత విభావరిలో వారి రాక స్వల్ప అంతరాయం కలిగించింది.

అప్పుడు రాఘవన్– "అంధుల పాఠశాల నుంచి వచ్చారు. చూపులేకపోయినా పాటలు వినాలన్న ఆసక్తితో వున్నారు!" అన్నాడు.

జయశ్రీకి హృదయం కలుక్కుమంది.

'తాను చూడగలదు. కానీ వినలేదు. వారు చూడలేరు. కానీ వినగలరు.... ఒక్కొక్క వ్యక్తికి ఒక్కొక్క లోపం' అనుకుంది జయశ్రీ.

అప్రయత్నంగా కళ్ళల్లో తడి చేరింది.

* * *

చెన్నైలో మాంబళం ప్రాంతం ఎబిలిటీ ఫౌండేషన్ సంస్థ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. వికలాంగుల్లో చైతన్యం కలిగించడానికి సంస్థ ప్రారంభమైంది.

దేశంలో ఉన్న వికలాంగుల జనాభా ఆరుకోట్లు. వివిధ రకాల వైకల్యాలతో బాధపడుతూ సమాజంలో ఎన్నో ఇక్కట్లు పడుతున్నారు. కొంతమందికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అందుతుండగా లక్షలాది మంది వికలాంగులు ఎటువంటి అవకాశాలను పొందలేకపోతున్నారు.

అటువంటి వారి కోసం ఎబిలిటీ ఫౌండేషన్ వని



చేస్తుందని నిర్వాహకులు ప్రకటించారు. వికలాంగులను వివిధ రంగాల్లో ప్రోత్సహించి వారి జీవితాలను మెరుగుపరచాలన్న సంకల్పంతో 1990లో ఏర్పాటైన సేవా సంస్థ ఎన్నో కార్యక్రమాలతో మంచిపేరు సంపాదించుకుంది.

వినబడని లోకం కోసం ఈ సంస్థను స్థాపించిన వ్యక్తి జయశ్రీ. చిన్నతనంలో ఆమె అనుభవించిన మానసిక వేదన... తనవంటి ఎంతోమంది జీవితాల్లో వెలుగులు విరజిమ్మాలన్న సదాశయంతో ఈ సంస్థ ఏర్పాటుకు ముందుకు వచ్చింది.

పదేళ్ళకాలంలో ఎన్నో కార్యక్రమాలను ఈ సంస్థ ద్వారా జయశ్రీ ప్రారంభించింది. వివిధ రకాల వైకల్యాల ఆధారంగా వికలాంగులను గుర్తించి జాబితాలను తయారు చేసింది. ఈ జాబితాల ఆధారంగా ఎవరికి ఎటువంటి సహాయం కావాలో గుర్తించి వారికి అందించడానికి ఏర్పాట్లు చేసింది.

తమిళనాడు కేంద్రంగా ఈ సంస్థ పని చేస్తున్నప్పటికీ వికలాంగులు దేశంలో ఏ మారుమూల ప్రాంతంలో ఉన్నా వారికి సహాయ కార్యక్రమాలు అందించడానికి కృషి చేసింది.

జయశ్రీ కృషికి ఎంతో ప్రోత్సాహం లభించింది. ఎంతోమంది మెచ్చుకున్నారు. ఎన్నో సంస్థలు సహాయం చేయడానికి ముందుకు వచ్చాయి. ఆమె కృషికి తమ చేయూత ఇస్తామని ప్రోత్సహించాయి.

ఆ సమయంలో జయశ్రీకి పరిచయమైన రవీంద్రన్ ఆమె జీవితాన్ని మరో మలుపు తిప్పారు.

* * *

ఎబిలిటీ ఫౌండేషన్ కార్యాలయం. పత్రికా విలేకరి రవీంద్రన్ వచ్చి లోపలున్న జయశ్రీకి తన విజిటింగ్ కార్డు పంపించాడు. వెంటనే పిలుపు వచ్చింది.

ఎదురుగా కూర్చున్న తర్వాత తాను రాసుకుని వచ్చిన ప్రశ్నల కాగితాన్ని ఆమె ముందు పెట్టాడు.

"మీరు వికలాంగుల కోసం ఎంతో కృషి చేశారు. మీ ఇంటర్వ్యూ ప్రచురించడానికి వచ్చాను!" అన్న కాగితం అందించాడు. దానిని చదివి జయశ్రీ ఎంతో సంతోషించింది.

"ఇంటర్వ్యూ ఇచ్చేటంత గొప్ప పని నేను చేయలేదు.... వినిపించని లోపం వికలాంగుల పట్ల ఒకలాంటి ఇష్టాన్ని పెంచింది. ఎవరో ఎక్కడో ప్రయత్నమన్నది ప్రారంభించాలి. అది నా ద్వారానే ఎందుకు కాకూడదని ఈ సంస్థను ప్రారంభించాను. ఎందరో ప్రోత్సాహం అందిస్తున్నారు..." అంటూ జయశ్రీ ప్రారంభించింది.

రవీంద్రన్ రాసుకుని వచ్చిన ప్రశ్నలన్నింటికి వివరంగా జవాబులను చెప్పింది. జయశ్రీ మాట్లాడిన ప్రతి మాటనూ తన పుస్తకంలో రాసుకున్నాడు.

జయశ్రీ మాటల్లో పట్టుదల... ఏదో చేయాలన్న తపన... అతడిని ఎంతగానో ఆకట్టుకున్నాయి.

అందుకే అన్నీ వివరంగా రాసుకున్నాడు.

విజయం వైపు పయనించిన అంగవైకల్యం పేరుతో వివరంగా ఒక వ్యాసం రాసి మధ్యలో జయశ్రీ ఇంటర్వ్యూ కూడా ప్రచురించాలని మనసులో నిశ్చయించుకున్నాడు.

ఆఫీసులో పని చేసే అబ్బాయి వేడివేడి సమోసాలు, పకోడి రవీంద్రన్ ముందు పెట్టేడు. సున్నితంగా తిరస్కరించాడు. టీ మాత్రం తాగాడు.

ఆ మరునాడు పత్రికలో ప్రచురించిన ఇంటర్వ్యూ కాపీ తీసుకుని మళ్ళీ జయశ్రీ వద్దకు వచ్చాడు. ఆ కాపీని ఆమెకు అందించాడు.

జయశ్రీ ఆనందానికి అవధులులేవు... ఫొటోతో పాటు పూర్తి వివరాలు అందులో ఉన్నాయి. "చాలా బాగా వచ్చింది... నేను చెప్పిన ప్రతి విషయం మార్పు లేకుండా పబ్లిష్ చేశారు... చాలా చాలా థాంక్స్" జయశ్రీ విలేకరిని ప్రశంసలతో ముంచెత్తింది.

రవీంద్రన్ ఏమీ మాట్లాడకుండా నవ్వి ఊరుకున్నాడు.. తర్వాత – "మీ గూర్చి పత్రికలో వస్తే ఇంత సరదా పడుతున్నారు. ఎంతోమంది వికలాంగులకు మీ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు అందిస్తున్నారు.

మీవంటి చైతన్యవంతుల గురించి మీరే తెలియజేయవచ్చు కదా?" అని రాసిన కాగితాన్ని ఆమెకు అందించాడు.

"ఎలా?" ఉద్వేగంగా ప్రశ్నించింది.

"వికలాంగుల కోసం మీరే ఒక పత్రిక ప్రారంభించండి!" మరో కాగితం మీద రాసి చూపించాడు.

జయశ్రీ ఆలోచనల్లోకి జారిపోయింది.

"నాకు ఇంతవరకూ రాని ఆలోచనను మీరు కలిగించారు. నడుపుతున్న సంస్థ ద్వారా వికలాంగుల కోసం ఓ పత్రిక తీసుకువద్దాం... మీరు ఈ రంగంలో ఉన్నారు కాబట్టి మీ సహకారం ఎలాగూ ఉంటుంది. వికలాంగుల కోసం వికలాంగురాలు నడిపే పత్రికగా ఎంతోమందిని అలరిస్తుంది-" అంది.

ఆ తర్వాత జయశ్రీ, రవీంద్రన్‌లు తరచూ కలుసుకున్నారు. పత్రిక ప్రారంభానికి తగిన ఏర్పాట్లు చేశారు. రిజిస్ట్రేషన్ చేయించారు. ఆరు నెలలకు సరిపడ మెటీరియల్ సిద్ధం చేసి ప్రింటింగ్ మొదలు పెట్టారు.

పత్రిక, పేరు సక్సెస్ అండ్ ఎచీవిట్ గా నిర్ణయించారు.

* * *

జయశ్రీ ప్రారంభించిన వికలాంగుల పత్రిక ప్రారంభంలోనే ఎంతోమందిని ఆకట్టుకుంది. ఆమెకు రచనా వ్యాసంగంపై ఒక మాదిరిగా ఉన్న ఉత్సాహం పత్రిక నిర్వహణతో మరింత పెరిగిపోయింది. ఎంతోమంది వికలాంగుల గూర్చి పత్రికల్లో వెలికి తీసుకువచ్చింది. వికలాంగుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు... వివిధ సంస్థల వివరాలు.. అంగవైకల్యాన్ని అధిగమించే మార్గాలు వంటివన్నీ అందులో వుండేవి.

రవీంద్రన్ తన సేవలను ఈ పత్రికకే ఎక్కువగా వినియోగించేవాడు. జయశ్రీ పట్టుదల, కృషి అతనిని ఎంతగానో ఆకర్షించాయి. సక్సెస్ ఎచీవిట్ పత్రికా కార్యాలయం. కార్యాలయానికి ఆనుకుని చిన్న లాన్. సాయంత్రం జయశ్రీ లాన్‌లో కుర్చీ వేసుకుని ఆ రోజే ప్రెస్ నుంచి విడుదలైన పత్రిక కాపీ చదువుతోంది. అప్పుడు వచ్చాడు రవీంద్రన్. దగ్గరలో వున్న కుర్చీలో కూర్చున్నాడు. కొద్దినెలలుగా ఇద్దరి మధ్య ఎంతో సాన్నిహిత్యం పెరిగింది. జయశ్రీ కుటుంబ సభ్యులలో కూడా ఎంతో మంచివాడిగా గుర్తింపు పొందాడు.

జేబులోంచి లెటర్‌పాడ్ తీశాడు. "రవీంద్రన్ గారూ! నాతో ఎక్కువగా మాట్లాడాలని కాగితాల పుస్తకం తెచ్చారా?" నవ్వి అవునన్నట్లు తల ఆడించాడు. "చెప్పండి?" అంది.

వెంటనే కాగితం తీసి – "మీతో ఒక విషయం చెప్పాలని ఉంది.. ఎలా చెప్పాలో తెలియడం లేదు" రాసి చూపించాడు.

"ఫర్వాలేదు... చెప్పండి..." జయశ్రీ

"మీ కృషి అంటే ఇష్టం... మీ పట్టుదల అంటే ఇష్టం.. మీరు చేస్తున్న సేవా కార్యక్రమాలు ఇష్టం... టోటల్‌గా మీరంటే ఇష్టం..."

కాగితం చదివి తలెత్తి మళ్ళీ దించుకుంది.

మరో కాగితం తీసుకుని "మీకు ఇష్టమైతే మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటాను. ఎవరూ లేని నా ఒంటరిజీవితానికి మీరు తోడు ఉండాలి..." రాశాడు.

కాగితాన్ని అందిస్తున్నప్పుడు రవీంద్రన్ చేతులు వణికాయి. జయశ్రీ రెండు మూడు సార్లు చదివింది. నోటి నుంచి మాటలు రాలేదు. కళ్ల నుంచి నీళ్ళు వచ్చాయి.

"నేను అదృష్టవంతురాలిని... మీరు రాసిన మాటలన్నీ నా నోటి నుంచి వచ్చినట్లే భావించండి సేమ్‌టూయూ!" అంది.

"థాంక్యూ జయశ్రీ థాంక్యూ.. నా కోరిక మన్నిస్తావనుకోలేదు... నీవు నా జీవితంలో ప్రవేశించడం నా అదృష్టం... " బిగ్గరగా అన్నాడు. అతని మాటలు ఆమెకు వినిపించలేదు... చిన్నతనం నుంచి పెదవుల కదలికలను అర్థం చేసుకోవడం తెలిసిన ఆమెకు రవీంద్రన్ మాటలు కూడా హృదయానికి అర్థమయ్యాయి.

"ఈ రోజు నుంచి నా పేరు జయశ్రీ రవీంద్రన్" తల వంచుకుని నెమ్మదిగా చెప్పింది.

రవీంద్రన్ ఆమె చేతిని తీసుకుని ముద్దు పెట్టుకున్నాడు. అతని హృదయ స్పందన ఆమె మనసుకు తాకింది. ★

ఒక వూరి కథ....

(9వ పేజీ తరువాయి)

కూడా రాలేదు. పుస్తకాలు చదివీ చదివీ నా మేధస్సునైతే పెంచుకోగలిగాను కానీ హృదయ వైశాల్యం పెంచుకోలేకపోయాను. 'వ్యక్తి ఔన్నత్యానికి కొలబద్ద మేధస్సు కాదు - హృదయం' అనే మహాత్ముని అక్షరాలు నా దృష్టిని పడి ఉండకపోతే ఇంకా అలాగే ఉండేవాడినేమో!

"నాన్నా... నిజంగా మీరు ఆ పొలాల్లోంచి కూడా బడికి వెళ్ళేవారా.." మామయ్య చెప్తున్న కబుర్లు వింటూ మధ్యలో వివేక్ ప్రశ్న.

"వర్షాకాలంలో వాగులు ఎక్కువగా వచ్చినప్పుడు ఈ కాలువ వెంట వెళ్ళే వాళ్ళం. లేదంటే ఆ పొలాల్లోంచి వెళ్ళే వాళ్ళం. పొలాల్లోంచి వెళ్తే దూరం తక్కువ. అలా మాటల్లోనే మా ఊరు దగ్గర పడ్తున్న కొద్దీ నాలో ఉద్వేగం... ఊరిని గతంతో పోల్చుకుంటూ ప్రతిదీ పరికిస్తున్నాను. కాలువకి ఆవలివైపున ఉండే లంబాడా గుడిసెలు చాలా వరకు పెంకుటిళ్ళుగా మారాయి. అంత దూరాన్నుంచే స్వాగతం చెప్తోంది డిష్ యాంటెన్నా. మేం ఉన్నామంటూ టెలిఫోన్ స్తంభాలూ.. కాస్త ముందుకెళ్ళగానే ఓ ఇంటి ముందు హార్వెస్టర్ ట్రాక్టర్ ఫర్వాలేదే మన వ్యవసాయంలో ఆధునికత చోటు చేసుకుంది. యంత్రాల వాడకం వచ్చేసింది. కానీ ఊరే ఏమీ పెరిగినట్లు కన్పించడం లేదు..." అన్నాను మామయ్య కేసి చూస్తూ...

"ఆ.. వచ్చేశాయి. యంత్రాలు మహాభూతాల్లా... మూడేళ్ళ నుండి వర్షాభావ పరిస్థితులకు తోడు యాంత్రీకరణ వల్ల వ్యవసాయ పనుల్లేక కూలీలు అల్లాడుతున్నారు. ఒక్కపూటైనా కూటికోసం తిప్పలు పడుతున్నారు. యంత్రాల ఉపయోగం రైతుకు ఒక విధంగా ఖర్చు తగ్గిస్తున్నా. కూలీల్లో మాత్రం తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఒకరిద్దరు లాభపడ్తున్నారేమో కానీ.. కూలీనాలీ జనం మాత్రం తీవ్రంగా నష్టపోతున్నారు. వారి మనుగడే ప్రశ్నార్థకంగా మారిపోతోంది" ఆవేదనతో మామయ్య.

మాటల్లోనే మా ఇంటి ముందుకొచ్చి ఆగింది ఆటో. ఇంటి ముందుండే మొక్కలు కన్పించడం లేదు. ఇల్లు మాత్రం పరుగులెత్తుతున్న కాలంతో పాటు తానూ పరుగెట్టలేని వయసైన వృక్తిలా... ముందు వరండాలో ఇద్దరు వృద్ధురాళ్ళు కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు. వారు వాకిట్లో ఆగిన ఆటో చూసి వచ్చింది ఎవరా అని ఆసక్తిగా గమనిస్తూ..

"కనకమ్మా... ఎవరొచ్చారో చూడవే..." అంటూ ఆటోదిగారు మావయ్య.

ఎవరో అర్థంగాక ఇద్దరూ... పరిశీలనగా మమ్మల్నే చూస్తూ... మామయ్య, వివేక్ సామానుదించుతుంటే ఉద్విగ్నతకు లోనవుతూ పాతికేళ్ళ తర్వాత ఇంట్లోకి అడుగుపెట్టాను. వరండాలోంచి లోపల గోడకు వేళ్ళాడుతున్న నాన్న ఫొటో గంధపుపూల దండతో. ఆయన గంభీరత వెనక దాగి ఉన్న అవ్యాజమైన ప్రేమ.... కన్న కొడుకుని ఉన్నత శిఖరాల వేపు పయనింపచేయాలనే ఆయన తపన... ఎంత విలువైందో ఇప్పుడర్థమవుతోంది. కళ్ళలోంచి నీళ్ళు జలజలా రాలాయి. కఠినమైన నా కళ్ళలోనూ నీళ్ళున్నాయని నిరూపిస్తూ.

"అమ్మా... బాగున్నావా?" అంటూ కన్నీటిని దాచుకుంటూ వంగి ఆమె కాళ్ళకు నమస్కరించా.

'నాన్నమ్మా నమస్తే' నా వెనకే వచ్చిన వివేక్... జీవితంలో ఇలాంటి ఉద్వేగపూరితమైన క్షణాలు వస్తాయని ఊహించలేదెప్పుడూ... అమ్మ మొహంలో సంభ్రమం... ఆశ్చర్యం... అంతలోనే దుఃఖం. ఆమె నోట మాట రావడం లేదు. కలా నిజమా... అర్థం కానట్లు అలాగే రెండు క్షణాలు ఉండిపోయినా "బుల్లెబ్బాయీ..." అంటూ నా రెండు చేతులూ పట్టుకుంది. గబగబా నాన్న ఫొటో దగ్గరకెళ్ళి ఏమండీ మీ బుల్లెబ్బాయి వచ్చాడు చూడండీ... అంటూ బావురుమంది. బిక్కమొహం వేసుకు చూస్తున్న వివేక్‌ని దగ్గరకు తీసుకుని ముద్దులు పెట్టింది. కొద్దిగా తేరుకున్న ఆవిడ కోడల్ని తీసుకురావాల్సిందంది. చుట్టుపక్కల వాళ్ళని పిల్చి మరీ చెప్పింది మా రాక గురించి.

ఎన్నాళ్ళగానో ఎదురు చూసే వస్తువు అకస్మాత్తుగా చేతికందితే చిన్నపిల్లలు పడే సంబరం, ఆనందం గుర్తొచ్చింది ఆమెను చూస్తే...

ఎప్పుడు బయలుదేరారో... ఏం తిన్నారో అంటూ వెనకవైపు ఉన్న చెట్టు నుంచి బొప్పాయి, నారింజ కోసి మా ముందు పెట్టింది. తినమంటూ బలవంతం చేసింది. పక్కింటి అనసూయత్త సాయంతో వంటపూర్తి చేసింది. మేం స్నానం చేసేసరికి వేడివేడి అన్నం, ముద్ద పప్పు, మూలక్కాడలు టమోటా కూర, సాంబారు, వడియాలు, అవకాయ, పెరుగులతో మమ్మల్ని భోజనానికి ఆహ్వానించింది. కొసరి కొసరి వడ్డించింది. సాయంత్రం వేడివేడి పకోడీలు, సున్నుండలు... అమ్మ ప్రేమనంతా రంగరించి మా ముందు పెట్టింది. ఆమె పెట్టినవన్నీ తినలేక వద్దంటే... నా మీద ఇంకా కోపం పోలేదా బాబూ అని నొచ్చుకుంది.

"అమ్మా... ఇంకెప్పుడూ అలా మాట్లాడకు. నీ మీద కోపం ఉంటే నిన్ను వెతుక్కుంటూ ఈ బుల్లెబ్బాయ్ వచ్చేవాడు కాదు" అని స్పష్టంగా చెప్పిన తర్వాత ఆమెలో నూతనోత్సాహం.

నేను వచ్చానని తెలిసి ఊళ్ళో వాళ్ళు వచ్చి పలకరించిపోతున్నారు. అమెరికా విశేషాలు అడిగి తెలుసుకుంటున్నారు. కొందరు నేను చేసే ఉద్యోగం, జీతభత్యాల గురించి ఆరా తీస్తుంటే మరికొందరు నా భార్య గురించి ఆరాతీస్తూ అమెరికా పిల్లను చేసుకున్నావట కదా... అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అలా సాయంత్రం 5 గంటలు అయిపోయింది. ఎండతీవ్రత కాస్త తగ్గింది. పాత ఫొటోలు తిరగేసిన వివేక్... "చాలా బోర్‌గా ఉంది నాన్నా..." అనడంతో ఆ టీవీ చూడు అన్నాను. "అదా... బ్లాక్&వైట్ టీవీ సరిగ్గా రావడం లేదు... ఏం చూస్తాం" అని మళ్ళీ తానే "నాన్నా మన ఊరు చూసొద్దామా...?" అన్నాడు. సరేనంటూ బయలుదేరాం.

"చీకటి పడకుండా వచ్చెయ్యండి బాబూ" హెచ్చరించింది అమ్మ.

(మిగతా వచ్చేవారం)

లక్ష్మి

కొత్త చోటింతే!

సొంత ఊరు-

కన్నతల్లిలాటిదంటారు!

బంగారం లాటిమాట!

ఎవరన్నారో తెలీదు!

ఆ మాట ఎవరన్నా వాళ్ళకి చేతులెత్తి మొక్కాలి. కడుపున పుట్టిన వాళ్ళు కసాయితనంతో పేట్రేగిపోవచ్చు. కన్నతల్లి మాత్రం ఎల్లాంటి పరిస్థితి ఎదురైనా కఠినాత్మురాలు కాలేదు! ఇది రూలు!

కన్నబిడ్డల పట్ల -

తల్లులందరూ ఎల్లప్పుడూ అతిమంచి వాళ్ళే!

చెడ్డ తల్లులు మచ్చుకైనా కనిపించరు!

సొంత ఊరు కూడా ఇంచుమించు కన్న తల్లి మాదిరే వుంటుంది. అవసరాల్లో ఆదుకునే వాళ్ళు - వుంటేగింటే - సొంత ఊళ్ళోనే దొరుకుతారు!

నీకు మేమున్నామని అమ్మలాగానే హామీ ఇస్తారు!

పొరుగూర్లో ఈ హామీ అంత సులువుగా దొరకదు!

మనం బతికి చెడిన వాళ్ళమో - చెడి బతికిన వాళ్ళమో వగైరా వివరాలు సేకరించే ఓపిక వాళ్ళకుండదు!

మనది దొడ్డ గుణమో దొంగగుణమో తెలీదు. అప్పిస్తే తిరిగి చెల్లిస్తామో - పద్ధులో రా సుకుని భద్రపరచుకోమని సలహా ఇస్తామో కూడా తెలీదు.

మన కథాకమామీషు ఏమీ తెలీకుండానే మనకి సాయం చేసేందుకు - పొరుగూర్లో - ఎవరు మాత్రం ఎందుకు ముందుకు వస్తారు?

అందువల్ల -

ఏ పాటి సాయం దొరికినా - సొంత ఊళ్ళోనే దొరుకుతుంది. అందుకే సొంత ఊరు కన్న తల్లిలాటిదని చెబుతుంటారు - కాబోలు!

ఆడపిల్లకి -

సొంత ఊళ్ళో కాపురం పెట్టే అదృష్టం చాలా తక్కువ. ఏదో ఒకరోజు పొరుగూర్లో అత్తవారింటికి వెళ్ళిపోతుంది!

పెళ్ళయింతర్వాత -

ఆడపిల్ల వెళ్ళవలసింది 'ఆడ'కే!

అందుకే ఆ పిల్లని-

'ఆడ'పిల్ల అని పిలుస్తారు!

ఎక్కడో ఒక మూలగా విసిరేసినట్టున్నా - సొంత ఊరు ఆమెకు స్వర్గంలా కనిపిస్తుంది. అక్కడున్న తనపుట్టిల్లు పాత పెంకుటిల్లయినా - ఇంద్రభవనంలా వుంటుంది!

పుట్టింటో ఆడపిల్ల యువరాణి హోదాలో వుంటుంది!

ఆ పిల్లమాట ఇంటిల్లి పాదికీ వేదవాక్కవుతుంది!

ఇదే వాతావరణం... ఇదే హోదా అత్తవారింటో కూడా వుంటుందని ఆశిస్తే - ఆ పిల్ల అమాయకత్వానికి జాలి పడాలి! చింతించాలి!

పుట్టింటో...

తీరుబడిగా ఏడింటికి నిద్ర లేచినా మందలింపులుండవు. మంచం దిగకుండానే కాఫీ అని ఆర్డరు వేసినా చెల్లుబడి అవుతుంది!

అత్తారింటో -

అల్లాంటి సదుపాయాలకు వీలుండదు. తెలతెలవారుతుండగా నిద్ర లేవాలి. స్నానాదికాలు పూర్తి చేసుకుని - ఇంటి జనాభాకి సేవలు చేయాలి!

అంతేగాని -

నా బద్ధకాన్ని భగవంతుడు కూడా మార్చలేడని ధీమాగా సమాధానం చెబితే - రెండో రోజే రైలు ఎక్కవలసి వుంటుంది!

కనక -

కొత్తచోటు కొంచెం ఇబ్బందిగానే వుంటుంది. కష్టాలు సరేసరి. కొన్ని సుఖాలు కూడా కొత్తచోటులో ఇబ్బందిగానే వుంటాయి!

పుట్టింటో కటిక నేల మీద పడుకున్నా - అయిదో నిమిషానికి కళ్ళుమూతలు పడటం ఎంత సహజమో... కొత్త చోట హంసతూనికా తల్పమ్మీద నడుం వాల్చినా తెల్లవార్లూ నిద్రపట్టకపోవడం అంత వాస్తవం!

కొత్తచోటులో సిగ్గూ, బిడియం... బెరుకూ భయం మనిషిని అవస్థలపాలు చేస్తాయి!

ఎవర్తో ఎట్లా ప్రవర్తిస్తే ఏమి తంటా వస్తుందోనన్న బెంగ కృంగదీస్తుంది!

అంచేత -

కొత్తచోటులో లభించే కొత్త సుఖాలకు ఏ ఆడపిల్లయినా అంత చొరవగా స్వాగతం పలకలేదు!

సొంత ఊళ్ళో-

తాను అలవాటు పడిన ఆ వాతావరణాన్ని అంత చప్పున మరిచిపోలేదు కూడా! సొంత ఊరితో ఈ కొత్త ఊరిని పోల్చుకుని చిరాకు పడుతుంది!

మా ఊరి అందాలు ఈ మాయదారి నగరంలో లేనేలేవనుకుంటుంది!

ఇక్కడ కనిపించే మేడల్ని చూస్తూ ఆహా ఓహో అనుకోడం నా వల్ల కాదని తనని తానే మందలించుకుంటుంది!

మా ఊరి కొబ్బరి తోటల వైభవం ముందు ఈ ఆర్భాటాలు మొత్తం అష్టరాలని తనకి తానే చెప్పుకుంటుంది!

మా ఊళ్ళో గాలీ అక్కడ నీళ్ళూ ఇక్కడ దొరకవని తీర్మానించుకుంటుంది!

అయ్యయ్యో స్వర్గం చేజారిపోయిందని నిత్యబెంగతో నీరసపడిపోతుంది!

కొండొకచో-

ఈ పెళ్ళి చేసుకుని స్వర్గానికి దూరమయ్యేనని కంటతడిపెడుతుంది. రాత్రిళ్ళు పీడకలలు కంటుంది. పగలు ప్రశాంతంగా గడపలేకపోతుంది!

ఈ కథ-

ఇట్లా ఎన్నాళ్ళు సాగుతుంది?

కరెక్టుగా ఇన్నాళ్ళని ఎట్లా చెప్పగలం! కొత్తచోట అలవాటయ్యేంత వరకూ ఇంతే! అంతవరకు ఆడపిల్లకి బెంగగానే వుంటుంది! తప్పదు! ఓర్చుకోవాలి!

ఇది పెళ్ళిళ్ళ సీజను!

పెళ్ళి కూతుళ్ళు సొంత ఊళ్ళు విడిచి అత్తవారిళ్ళకు చేరుకునే సీజను!

అందుకే రాసేను! ★

"అన్నపూర్ణమ్మ గారిని ఆసుపత్రిలో చేర్పించారు. పచ్చబాబుగారి భార్యగారాయె! ఆయనగారు మహాగాబరా పడిపోతున్నారు. డాక్టర్లు గుబగుబలాడి పోతున్నారు. సోమయ్య లబలబ... పాపం... ఆపరేషను అవసరమేమో...

రుక్మిణి

అన్నపూర్ణ - అజీర్తిరోగం

రావి చెట్టు చప్టా మీద కూర్చుని బీడీ పీకుతున్న యాద్గిరి దగ్గరకు జక్కులోడు, మల్లేశం ఒక విషయం మీద తీవ్రంగా వాదులాడుకుంటూ... వచ్చారు.

"అన్నా... నువ్వే జరచెప్పు... వెన్నుపూస... వెన్నెముక రెండు వేర్వేరు గద... వీడేమో పూసా-ముక్కా రెండూ ఒకటే అంటాడు.. గదెట్లా?" జక్కులోడు జబ్బలు చరిచాడు. యాద్గిరికి ఒళ్ళు మండిపోయింది.

"అరెబాంచెత్... దమాక్ లేదుర... పూసాముతక్కా రెండూ ఒకటే! ఈపున నిలువున నిలబెట్టి వుంచేది వెన్నెముక... మరి దాన్లో వెన్నుపాము..." ఇక యాద్గిరి వివరణతో ఇద్దరూ రాజీపడి చప్టామీద కూలబడిపోయారు.

"అది సరేన్నా... దేశానికి పంటలు పండించే రైతే 'వెన్నుపూస' అంటాడు వీడు. కాదురా వెన్నెముక అంటాను నేను... గంతే!" జక్కులోడు వివరణ ఇచ్చాడు. యాద్గిరి బీడీని దూరంగా విసిరేశాడు. "ఒరే వెన్నెముక విరిగిపోతే ఏమైతదిరా?" యాద్గిరి నింపాదిగా అడిగాడు. "ఏమైతది? మనిషి కూలబడతడు. నడవలేడు-" మల్లేశు టక్కున జవాబిచ్చాడు. అపుడు జక్కులోడికి ట్యూబ్‌లైటు వెలిగింది.

"ఓహో... మన గ్రామాల్లోని రైతులందరు అట్లా కూలబడి పోయినారనే గదా... అయినా కాలం మారిపోయింది. మన రైతులకు నీళ్ళ వాడకం సరిగ్గా తెలవకపాయె! పాతకాలపు నాగలి బుజానేసుకుని కాడికి రెండెడ్లు తగిలిచ్చి వరసబెట్టి దున్నుదాయె! ఎక్కువ నీళ్ళు వాడకమాయె! పాతకాలపు పంటలే వేసుకుంటు పడుంటే వెన్నెముక కాదు తుంటి ముక్క కూడా వక్కలయితది" జక్కులోడు బహు కసిగా అన్నాడు.

"నువ్వన్నవి శానబాగుందిర! రోజూ కొన్ని వేల టి.ఎం.సి.ల నీళ్ళు సముద్రంలో కలిసిపోతుంటే సూడ్డానికి సోద్యంగానే వుంటది! తాతలనాటి చెరువులు తప్ప మరో నీటి వనరులు లేకపోటం అభివృద్ధిగాక మరేంది. రైతులను దివాళా తీయించి బడా పరిశ్రమల వాండ్లకు వాళ్ళ భూవుల్ని చవగ్గ ఇప్పించి రైతులకున్న గోచీలు వూడిపోయేటట్లు చేయటం స్వర్ణాంధ్ర... ఒరే... ఈ గత తొమ్మిదేండ్ల నుండి ఒక్క నీటి ప్రాజెక్ట కట్టినార్ర... ప్రాజెక్టులు వద్దాయె.. తుంపరసేద్యం ఏందిర? నోటినిండ నీళ్ళు పుక్కిలించి పొలం నిండా జల్లితే - అవి సేద్యమా? ఇక కరంటు యవ్వారం... రెండేసార్లు రేట్లు పెంచి నడ్డి విరగదీసినమని ఒక మంత్రి... కాదు కాదు ఆరుసార్లే పెంచి బుర్రకాయ బద్దలు చేసినమని ఒక మంత్రి... వచ్చే అయిదేండ్లలో ఇక రైతులకు లక్ష కోట్లు ఖర్చు చేస్తమంటరు. మార్కెట్లో పండించిన టమాటా కిలో



పావలాకు కొనే దిక్కే లేకపాయె!" యాద్గిరి వాక్ప్రవాహానికి జక్కులోడు హాహాకారం చేశాడు. మిడిగుడ్లేసుకుని చూస్తూ నోరెళ్ళబెట్టాడు.

"ఇంకుడు గుంతలు... నీరు - మీరు - వారు - వీరు.. ఎవర్రా వీళ్ళంతా... రైతు నడ్డి విరగదీయడానికి ప్రపంచ బ్యాంకు రచించిన రకరకాల పథకాలు... పెట్టి బికారి వెధవల్ని చేసి పారేసిరి. ఇంకా రాష్ట్రంలో రైతు అనేవాడు - పదానికే అర్థం లేకుండా పోయిందిరా పిచ్చోడా...!" యాద్గిరి అట్లా చదామడా తిట్లకు లంకించుకుంటూనే వున్నాడా... తాగుబోతు గరివిగాడు 'తందానతాన' దురువేసుకుంటూ యమా హుషారుగా అక్కడికి వచ్చి కూలబడి ఒకసారి 'బ్రేవు'మని తేన్చాడు.

"అరె గంత లావున తాగిన వేందిర" జక్కులోడు మండిపడ్డాడు. గురివిగాడు వెకిలిగా నవ్వాడు.

"ఒరె యాద్గిరీ... పొద్దట్నుంచే కాదు.. మూడ్రోజ్నుండీ నేనేం తిన్లే... ఏదో ఎలక్షను పార్టీ వాళ్ళు తాగిస్తే గింత తాగిన... సీజను గద! కానీ... గట్లా అర్థగంటకోసారి కడుపుబ్బరించినట్లు బేవరింతలు తియ్యాలె. అరె... మీకు తెలవదుర... గట్లా తీయకపోతే ఖతం! ప్రాణాలు పోతయి - నిజెం... అమ్మతోడు..."

గురివిగాడు అంత నిజాయితీగా చెప్తుంటే జక్కులోడు అవాక్కయ్యాడు. "ఎవడ్రా నీకు చెప్పిందీ... మనూరి కొత్త డాక్టరా?" అని అమాయకంగా అడిగాడు.

"ఒరి జక్కులోడా... ఆ డాక్టరుకేం తెలుసురా... వినంద్రా... రాత్రి నేను గుడిసెలోనుండి బయటకు వచ్చేసరికి మన చింత చెట్టు కింద యమధర్మరాజు దున్నపోతు మీద... చిత్రగుప్తులు చిట్టా అందుకుని మాట్లాడుకుంటున్నార్రా... యహె... మనోళ్లే గదా అని నేను మాటలు కలిపిన... శానమంచోల్లురా... మంచిగ మాట్లాడిండ్రు - మనూర్లె పంటలు బాగా పండినవట... అంతేగాక ఢిల్లీ బియ్యం లచ్చల టన్నులు వచ్చె - గవన్ని చెడమడ తిన్న మన రైతులు పొట్టల్లో అన్నాలు అరక్కపాయె - అందుకని కిందపడి దొర్లి... అబ్బో... అట్లా పగల పగల తిన్నవాండ్ల లిస్టొటి తయారు చేసిండ్రా - అయితే తూతూ మంత్రంగా... ఏం రోగం లేకుండా వాళ్ళ పాణాలు పీక్కుపోతే ఎవరైనా తిట్టుకుంటరు గద... అందుకని అట్లాంటి వాళ్ళందరితోని ఆత్మహత్యలు... 'అన్నం అరక్క ఆత్మహత్యలు' చేసుకునేటట్లు చేసి పాణాలు పీక్కుపోదామని పెద్దప్లాను తయారు చేస్తుంటే నాకు ఒళ్ళంతా వణికిపాయె! మరైతే నేను దండం పెట్టి 'దీనికి విరుగుడు లేదా సారూ' అంటే దయ తలచి ఈ 'బేవరింతల' ఉపాయం - మార్గం చెప్పి వాళ్ళ దోవన వాళ్లు వెళ్ళి పాయిరి! నిజెం - అన్నం కొంచెం తినాలె - ఢిల్లీ బియ్యం పుణ్యానికి దొరికిందని రోజుకు పదిసార్లు తిని రైతన్నలు గివి అరక్క ఆత్మహత్యలు చేసుకునిరి-"

యాద్గిరి పండ్లు పటపట కొరికాడు.

* * *

పచ్చబాబు గారి భార్య అన్నపూర్ణమ్మగారికి ఆజన్మాంతం 'అజీర్తి' వ్యాధి పట్టుకుందని పెద్దడాక్టర్ల పరీక్షలో తేలింది. పాపం దానికికారణం మరీ చిత్రంగా తేలింది. పచ్చబాబులాంటి చోటామోటా పచ్చ నాయకులు ఢిల్లీ బియ్యాన్ని రిటైల్‌గా, టోకున భోంచేసి బొజ్జలు - జేబులు నింపుకున్నందుకుగాను వాళ్ళందరికీ కానుకగా ఈ అజీర్తి రోగాలు పట్టుకున్నాయని 'ఆలిండియా అమెరికన్' ఆస్పత్రి వారు తమ రిపోర్టులో తెలిపారు! ★

క్లినికల్ మలేరియా

డాక్టర్ నాగినేని భాస్కరరావు

(గత వారం తరువాయి)

మలేరియా లక్షణాలు ప్రాంతము యొక్క స్థితిని బట్టి వుంటాయి.

ఇంక్యుబేషన్ కాలం : శరీరంలోనికి స్పోరోజాయిట్స్ ప్రవేశించిన క్షణం నుండి వ్యాధి లక్షణాలు కన్పించే కాలమునకు మధ్య కాలమును ఇంక్యుబేషన్ కాలం అంటాము. స్పోరోజాయిట్స్ టీకా మార్గాన శరీరంలోకి ప్రవేశించిన అరగంటలోపులో కాలేయ కణములలో వృద్ధి చెందుతాయి. ఇంక్యుబేషన్ కాలం 9 నుండి 28 రోజుల వరకు వుంటుంది. పరాన్న జీవుల రకమును బట్టి ఈ దిగువ సూచించిన విధంగా వుంటుంది.

రకం	ఇంక్యుబేషన్ కాలం
1) ప్లాస్మోడియం పాల్సిఫారం	సగటున 12 రోజులు, 9-14 రోజులకు రేంజ్.
2) ప్లాస్మోడియం వైవాక్సు	సగటున 15 రోజులు. రేంజ్ : 12-17 రోజులు, కొన్ని రకాల్లో దీర్ఘకాలం - 6-12 నెలలు
3) ప్లాస్మోడియం మలేరియా	సగటున 28 రోజులు. రేంజ్ 18 నుండి 40 రోజులు.

డయాగ్నోసిస్ గురించి చర్చించే ముందు వ్యాధి లక్షణాలు గురించి తెలుసుకుందాం.

లక్షణాలు : జ్వరం, ఫ్లూ వంటి అస్వస్థత, వణుకుతో చలి, తలనొప్పి, కండరాల నొప్పులు, నీరసం, వాంతులు మొదలగునవి మలేరియా జ్వరంలో నాలుగు దశలు ఈ కింద సూచించిన విధంగా వుంటాయి.

1) చలిదశ : ముఖ్యమైన మలేరియా లక్షణం చలితో కూడిన వణుకుడు ఈ దశలో చలిగా వుండటం నుండి వశముకాని వణుకుడు, ఎన్ని దుస్తులు వేసినా, దుప్పట్లు కప్పినా తగ్గని చలి వుంటుంది. ఇది రెండు గంటల వరకూ వుంటుంది. ఈ సమయంలో నాడి వేగము హెచ్చుగా వుండి, బలహీనంగా వుంటుంది. వేళ్ళు పెదవులు ప్రాణవాయువు తగ్గుట చేత నీలిరంగుకు మారిపోతాయి. చర్మం పొడిగా వుంటుంది. ఈ దశలో ముఖ్యంగా పిల్లలు వాంతి చేసుకోవచ్చు.

2) వేడిదశ, జ్వరం రావటం : చలిదశ తరువాత వెంటనే వేడి దశ వస్తుంది. తీవ్రమైన చలి బాధించే వేడికి దారి తీస్తుంది. రోగి దుస్తులను, దుప్పట్లను తీసివేస్తాడు. ఉష్ణోగ్రత పెరిగి కొన్ని సమయాల్లో 41^{0}సెంటిగ్రేడ్ (106^{0} ఫారన్‌హీట్) వరకు వస్తుంది. ఈ దశలో విపరీతంగా మంటతో తలనొప్పి, వాంతి వచ్చినట్లు వుండటం, వాంతి కావడం జరుగుతుంది. చర్మం పొడిగా వుంటుంది. చూపులో తేడావస్తుంది. వెలుగును చూడలేకపోవడం, వణుకుడు ముఖ్యంగా చిన్నపిల్లల్లో వస్తుంది. ఈ ఉష్ణోగ్రత 8 నుండి 12 గంటల వరకు వుంటుంది.

3) చెమట దశ, జ్వరం తగ్గటం : ఉష్ణోగ్రత ఒక ప్రమాదకర స్థితి లాగా ఒక్కసారిగా తగ్గిపోతుంది. చెమటలు పోస్తాయి. ఒక్కోసారి సాధారణ ఉష్ణోగ్రత కంటే తక్కువగా వుంటుంది. దీనిని 'చెమట పట్టే దశ' అంటారు. రోగి యొక్క పడక తడిసిపోయేంతగా చెమటలు పోస్తాయి. రోగి నీరసపడిపోతాడు. ఒక్కోసారి దీర్ఘనిద్రలోకి జారుకుంటాడు. లేక సాధారణ స్థితికి వస్తాడు. ఈ దశ 2-4 గంటలుంటుంది.

4) జ్వర రహిత కాలం : పైన చెప్పినట్లు జ్వరం వచ్చి పోవటం తరువాత మలేరియా రోగి జ్వరం లేకుండా కొంతకాలం వుంటాడు. మరల కొన్ని గంటలు లేదా రోజుల తర్వాత జ్వరం వస్తుంది. ఈ మధ్య విరామ కాలం లేక ఎన్ని గంలకొకసారి జ్వరం కథ వస్తుందో దీనిని పీరియాడిసిటీ ఆఫ్ ఫీవర్ ఎపిసోడ్ అని అంటారు. అది మలేరియా పరాన్న జీవుల రకాన్ని బట్టి మారుతుంది. ఈ దిగువనిచ్చినవిధంగా

ప్లాస్మోడియం పాల్సిఫారం మలేరియాలో 36 నుండి 48 గంటల కొకసారి జ్వరం వస్తుంది.

ప్లాస్మోడియం వైవాక్సు మలేరియాలో 48 గంటల కొకసారి జ్వరం వస్తుంది.

ప్లాస్మోడియం మలేరియె మలేరియా 72 గంటల కొకసారి జ్వరం వస్తుంది.

మలేరియా రోగుల్లో కాలేయం, ప్లీహము వాచి పరిమాణం పెరుగుతాయి. వ్యాధి నిర్ధారణ కేవలం లక్షణాలను బట్టి మలేరియా వ్యాధి నిర్ధారణ చేయలేము. ఈ దిగువ నీయబడిన అదనపు లక్షణాలు కలిగి వున్న రోగులను చిక్కులు లేని మలేరియా రోగులుగా పరిగణించాలి.

1) దగ్గు - తరుణ శ్వాసకోశ వ్యాధులు
2) ముక్కు కూడా కారుతున్న పడిశం
3) చర్మంపై దద్దుర్లు రావటం
4) మూత్రంలో మంట
5) చర్మవ్యాధులు ఉదా॥ చిన్నగడ్డలు, చీముగడ్డలు, పుండ్లు,
6) నొప్పితో వాచిన కాళ్ళు
7) చెవిలో చీము కారుట



రక్తం నమూనా తీయుట : జ్వరం వున్న రోగులందరికీ రక్తం నమూనాలను తీసి వాటిని స్టయిన్ చేసి సూక్ష్మదర్శినిలో మలేరియా క్రిముల కోసం పరీక్ష చేయాలి. మలేరియా అనుమానం వున్న రోగులకు తప్పనిసరిగా రక్తం నమూనాలు తీసి, ఆ తరువాత ఊహాత్మక చికిత్స ఇవ్వాలి. నిర్ధారణ తరువాత సంపూర్ణ చికిత్స ఇవ్వాలి. జ్వరం లేకున్నా - రోగి రిపోర్టు చేసేటప్పుడు - స్లైడ్‌పై రక్తం నమూనా - పలుచగా మరియు మందంగా వుండాలి. రక్తం నమూనాలను జియామ్సా స్టయిన్ లేక లైమాన్ స్టయిన్‌తో స్టయిన్ చేసి సూక్ష్మదర్శినిలో పరీక్షించాలి.

2) రాపిడ్ మెథడ్ : ఫీల్డ్ స్టయిన్, జెఎస్‌బి జస్వంతసింగ్, భట్టాచార్జి స్టయిన్‌ను ఉపయోగించి స్టయిన్ చేయవచ్చు. సూక్ష్మదర్శిని కింద స్లైడు నుంచి మలేరియా పరాన్న జీవుల కోసం పరీక్ష చేయాలి.

పైన చెప్పబడిన పద్ధతిలో రక్తం నమూనాలో మలేరియా (క్రిములు) పరాన్న

జీవులు లేనట్లయితే బోన్ మారో పరీక్ష చేయాలి.

ఇతర కొత్త పద్ధతులు : మలేరియా వ్యాధి నిర్ధారణకు ఈ కింది కొత్త పద్ధతులను ఉపయోగించవచ్చు.

1) ఫ్లూరసెంట్ మైక్రోస్కోప్, 2) ఇమ్యునోలాజికల్ మెథడ్స్, 3) మాలిక్యులార్ బయోలాజికల్ డిటెక్షన్ టెస్ట్స్

చికిత్స

రోగి రక్తంలో మలేరియా పరాన్న జీవులున్నట్లు నిర్ధారణ జరగక ముందు ఊహాత్మక చికిత్స, నిర్ధారణ జరిగాక సంపూర్ణ చికిత్స ఇవ్వాలి. వివరాలు ఈ కింది విధంగా వున్నాయి.

ఎ) ఊహాత్మక చికిత్స : రక్తం నమూనాను తీసుకున్నాక ఫలితం రాకముందే ఊహాత్మక చికిత్సను అన్ని రకాల జ్వరం కేసులకు లేక గత 15 రోజులుగా బాధపడుతున్న వారికి లింగ, వయో భేదం లేకుండా ఇవ్వవచ్చు. గర్భిణీ స్త్రీలు (గర్భిణి ఎన్నో మాసం అయినా సరే), ప్రసవించిన వెంటనే నెలలోపు కాలంలో కూడా ఈ చికిత్సను తీసుకోవచ్చు. రక్తం నమూనాలు తీసుకోని ఇతర జ్వరం కేసులకు కూడా ఈ చికిత్సను ఇవ్వవచ్చు. ఊహాత్మక చికిత్సలో ఒక కిలో శరీర బరువుకు 10 మీ. గ్రా. క్లోరోక్విన్ ఫాస్ఫేటు చొప్పున ఒకే మోతాదులో ఇవ్వాలి.

పెద్దల మోతాదు : ఒకే మోతాదులో క్లోరోక్విన్ ఫాస్ఫేటు 600 ఎమ్.జి. (4 మాత్రలు). ఊహాత్మక చికిత్సలో వయస్సును బట్టి క్లోరోక్విన్ మోతాదులు ఈ దిగువ ఇవ్వబడ్డాయి.

వయస్సు (సం॥లలో)	క్లోరోక్విన్ ఫాస్ఫేటు మాత్రలు	
	మి.గ్రా. బేస్	మాత్రల సంఖ్య
1 సం॥లోపు	75	1/2
1-4	150	1
5-8	300	2
9-14	450	3
15 ఆపైన	600	4

సవరింపబడిన జాతీయ మలేరియా నిర్మూలన కార్యక్రమాన్ననుసరించి అనుమానం వున్న / నిర్ధారింపబడిన మలేరియా కేసులకు ఈ కింది విధంగా ఊహాత్మక చికిత్స నివ్వాలి.

క్లోరోక్విన్‌బేస్ 1 వరోజున 10 మి.గ్రా./కి.గ్రా (600 మి.గ్రా. పెద్దలకు)

ప్రీమాక్విన్ 1వ రోజున 0.75 మి.గ్రా/కి.గ్రా. (45 మి.గ్రా. పెద్దలకు)

క్లోరోక్విన్‌బేస్ 2వ రోజున 10 మి.గ్రా/1 కి.గ్రా. (600 మి.గ్రా. పెద్దలకు)

క్లోరోక్విన్‌బేస్ 3వ రోజున 5 మి.గ్రా/కిలో (300 మి.గ్రా. పెద్దలకు)

బి) సంపూర్ణ చికిత్స : సూక్ష్మదర్శినిలో పాజిటివ్ మలేరియా కేసులన్నిటికీ మలేరియాను తిరగబెట్టనివ్వని, గామిటోసైట్స్‌ను చంపే గుణం కలిగిన ప్రీమాక్విన్ మందుతో కూడిన సంపూర్ణ చికిత్సను ఇవ్వాలి. ఈ చికిత్సతో మలేరియాను పూర్తిగా నయం చేయవచ్చు. అంతేకాక మలేరియా పాజిటివ్ రోగి నయమై దోమలకు మలేరియాను సంక్రమింప చేయలేదు.

ఎ) సూక్ష్మదర్శిని పరీక్షలో ప్లాస్మోడియం వైవాక్సు పాజిటివ్ కేసులకు సంపూర్ణ చికిత్స ఈ కింది విధంగా ఉంది.

పెద్దల మోతాదు : ఒకే మోతాదులో 600 మి.గ్రా. క్లోరోక్విన్ ఫాస్ఫేటు, 15 మి.గ్రా. ప్రీమాక్విన్‌ను మొదటి రోజున ఇవ్వాలి.

2వ రోజు నుండి 4వ రోజు వరకు రోజుకు 15 మి.గ్రా. చొప్పున ప్రీమాక్విన్‌ను ఇవ్వాలి.

వయసును బట్టి సంపూర్ణ చికిత్స మోతాదులు

వయస్సు సం॥లలో	క్లోరోక్విన్ మాత్ర ఒకే మోతాదు		ప్రీమాక్విన్ మాత్ర రోజువారి మోతాదు 5 రోజులకు	
	మి.గ్రా.	మాత్రల సంఖ్య	మి.గ్రా బేస్	మాత్రల సంఖ్య
1 సం॥లోపు	75	1/2	నిల్	నిల్
1-4	150	1	2.5	1
5-8	300	2	5.0	2
9-14	450	3	10.0	4
15 సం॥పైన	600	4	15.0	6

హెచ్చరిక : పసిపిల్లలకు, గర్భిణీ స్త్రీలకు ప్రీమాక్విన్ మాత్రలు ఇవ్వరాదు.

బి) సూక్ష్మదర్శిని పరీక్షలో ప్లాస్మోడియా ఫాల్సీపారమ్ మలేరియా రోగులుగా నిర్ధారించబడిన వారికి సంపూర్ణ చికిత్స ఈ కింది విధంగా ఇవ్వవలెను.

పెద్దల మోతాదు : ఒకేమోతాదులో 600 మి.గ్రా. క్లోరోక్విన్ ఫాస్ఫేటు (10 మి.గ్రా. /కిలో శరీర బరువును 45 మి.గ్రా. ప్రీమాక్విన్ (0.75 మి.గ్రా./కిలో శరీర బరువు)ను వెంటనే ఇవ్వాలి

వయస్సును బట్టి సంపూర్ణ చికిత్స :

వయస్సు సం॥లలో	క్లోరోక్విన్ మాత్ర ఒకే మోతాదు		ప్రీమాక్విన్ మాత్ర ఒకే మోతాదు	
	మి.గ్రా. బేస్	మాత్రల సంఖ్య	మి.గ్రా. బేస్	మాత్రల సంఖ్య
1 సం॥లోపు	75	1/2	నిల్	నిల్
1-4	150	1	7.5	1/2
5-8	300	2	15.0	1
9-14	450	3	30.0	2
15	600	4	45.0	3

సి) క్లోరోక్విన్ ఫాస్ఫేటుకు లొంగని ప్లాస్మోడియం ఫాల్సిపారమ్ కేసులకు సవరించిన మందుల విధానమునుసరించి సంపూర్ణ చికిత్స ఈ కింది విధంగా వుంది.

పెద్దల మోతాదు : సల్ఫాలిన్ + సల్ఫాడోక్సిన్ - 1500 మి.గ్రా. ఒకే మోతాదు + పైరి మిథాలిన్ మూడు మాత్రలు - 75 మి.గ్రా.

ఆ తరువాత ప్రీమాక్విన్ 45 మి.గ్రా. మాత్రలు ఒకే మోతాదుగా

పై మందులను ఒకేరోజున వాడరాదు. ఆ మందులు రక్తంలో హీమోలైటిక్‌క్రైసిస్‌కు దారి తీసే పరిస్థితులను సృష్టిస్తాయి. జి6-పి.డి. డెఫిషియన్సీ గురించి రక్తపరీక్ష చేయించిన తరువాత వాడాలి.

అంతేకాక సల్ఫాలిన్+సల్ఫాడోక్సిన్+పైరిమిథామిన్ అను సల్ఫా మందులను ఒకరోజున వేసుకోవాలి. ఆ మరుసటి రోజున తప్పనిసరిగా ప్రీమాక్విన్ మాత్రలు వేసుకోవాలి.

పై మందులకు లొంగని తీవ్రమైన చిక్కులకు దారి తీసిన మలేరియా - ప్లాస్మోడియం పాల్సిపారమ్ రకం - కేసుల్లో క్వినైన్ మందును సిర ద్వారా ఇవ్వవచ్చు. మోతాదు ఈ దిగువ సూచింపబడింది. 10 మి.గ్రా./ఒక కిలో శరీర బరువు చొప్పున క్వినైన్‌ను రోజుకు మూడు సార్లు సిర ద్వారా (మి) 5 శాతం డెక్స్‌ట్రోస్ ద్రావణంతో కలిపి నాలుగు గంటల వ్యవధిలో ఇవ్వాలి. రోగికి స్పృహ వచ్చాక అదే మోతాదు మందును అనగా 10 మి.గ్రా./కి.గ్రా. నోటి ద్వారా మాత్రలు ఏడు రోజుల పాటు ఇవ్వాలి. మధ్య మధ్య రక్తంలో గ్లూకోజు స్థాయి పరీక్షలు చేయించాలి. ఎందుకనగా క్వినైను మందు రక్తంలో గ్లూకోజు స్థాయిని తగ్గిస్తుంది

కొత్త మందులు : అర్టిసునేట్ మాత్రలు - 60 మి.గ్రా. 0, 4, 24 మరియు 48 గంటలు.

చికిత్సలో ఇతర చర్యలు : పైనుదహరించిన మలేరియా చికిత్స ఇవ్వడమే కాక ఇంకా ఈ దిగువ చెప్పబడిన చర్యలు తీసుకోవాలి. (1) తలనొప్పి, శరీర నొప్పుల నివారణ. (2) శిశువుల్లో, పిల్లల్లో వణుకుడు నివారణ, స్పృహ కల్గించుటకు (కోల్పోయిన వారికి) (3) ఎక్కువసేపు అధిక ఉష్ణోగ్రత వల్ల, నీరు తక్కువగా తీసుకొనుట వల్ల కలిగిన డీహైడ్రేషన్ (శరీరంలో నీరు తగ్గుట)ను సరి చేయుట.

ఆస్పత్రికి పంపవలసిన పరిస్థితులు :

మలేరియా కేసులకు వైద్యం చేసినప్పటికీ అది తగ్గకపోతే ఆస్పత్రికి పంపవలసి వస్తుంది. ఈ కింది పరిస్థితులలో మలేరియా రోగిని ఆస్పత్రికి పంపాలి. (1) ప్రారంభ చికిత్స తరువాత 48 గంటల తరువాత కూడా జ్వరం తగ్గకపోవటం. (2) ఎడతెగని వాంతులు, కడుపులోకి ఇచ్చిన మందులు నిలవకపోవటం, (3) ఎప్పుడూ ఎక్కువయ్యే తలనొప్పి (4) తీవ్రంగా శరీరంలో నీరు కోల్పోవుట (5) రోగి సాధారణ స్థితి క్షీణించుట (6) స్పృహలో మార్పులు ఉదా : కలవరపడటం, నిద్రమత్తులోకి పోవటం, కళ్ళు బైర్లు కమ్మటం, స్థితిని గుర్తించకపోవటం, వెలుగును చూడలేకపోవడం (7) శరీరం వణుకుట, కండరాలు కొట్టుకొనుట (8) తీవ్రమైన పాండురోగం (9) గర్భిణీ స్త్రీలలో పాండురోగం (10) కామెర్లు (11) తీవ్రమైన ఉష్ణోగ్రత (12) మూత్రపిండాలు సరిగ్గా పని చేయకపోవుట (13) రక్తస్రావము, రక్తం గడ్డకట్టు ప్రక్రియల్లో మార్పులు (14) ఊపిరితిత్తుల్లో నీరు చేరుట

భారతదేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో మలేరియా తీవ్రత ఉంది. కనుక ప్రభుత్వాల చిత్తశుద్ధితో పని చేసి మలేరియాను నిర్మూలించాలి. ప్రజలు చైతన్యవంతులై సరైన సమయంలో అర్హత గల డాక్టర్‌ని సంప్రదించి జబ్బు చేసినపుడు చికిత్స తీసుకోవాలి. మలేరియా బారి నుండి తప్పించుకోవాలి. మలేరియా నిర్మూలన కార్యక్రమంలో కూడా నివారణే ముఖ్యం. ★

లక్ష్య సాధనకు మార్గదర్శి

ప్రతి ఒక్కరూ ఒక పనిని ప్రారంభించేటప్పుడు తాను విజయం సాధించాలనే లక్ష్యంతోనే మొదలవుతారు. అయితే దానిని ఎలా సాధించాలో ఒక ప్రణాళికను రూపొందించుకున్నప్పుడు విజయం సాధ్యమవుతుంది. లక్ష్యంలేని పని తెరచావలేని నావ మాదిరిగా మారుతుంది. కాబట్టి పని చిన్నదైనా, పెద్దదైనా దానిలో విజయం సాధించేందుకు ముందుగా ఒక పథకం అవసరం అంటూ రచయిత తన పుస్తకంలో ఉదాహరణల పూర్వకంగా వివరించారు. ఇందులో విజేతలు కావాలంటే ఏవిధంగా నడుచుకోవాలో మొత్తం 33 అంశాలుగా విభజించి విశ్లేషించారు.

నేటి పోటీ ప్రపంచంలో మనం ఎన్నుకొన్న రంగంలో విజయం సాధించాలంటే ఎంతో కష్టపడవలసిన ఆవశ్యకతను ఇందులో నొక్కి చెప్పారు. ఆ కష్టాన్ని ఎలా ఆహ్లాదకరంగా మార్చుకొని పనిని సాధించాలి అనే దానికి చక్కటి సమాధానం ఈ గ్రంథం. రచయిత తాను స్వయంగా ఎంతో అధ్యయనం చేసి, పరిశీలన జరిపి చక్కటి ఉదాహరణల ద్వారా ఒక్కో అంశాన్ని ఎంతో ఆసక్తిదాయకంగా ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దారు.

ఎవరైనా తాము నలుగురిలో గుర్తింపును పొందాలంటే చేయ కూడని పనులేమిటో కూడా ఇందులో చక్కగా విశ్లేషించారు. మనకు అటువంటి పరిస్థితి ఎదురైనప్పుడు ఆ తప్పులు చేయకుండా ప్రయత్నించేందుకు ఇది ఉపయోగపడుతుంది. కొన్ని అంశాలకు సంబంధించి మనకు మనమే సరిచూసుకొనేందుకు వీలుగా ప్రశ్నావళులను పొందుపరచడం కూడా చాలా బాగుంది. మనిషి బ్రతకడానికి ఆక్సిజన్ ఎంత అవసరమో జీవితంలో విజయపథం వైపు వెళ్ళడానికి ఉత్సాహం అంత అవసరం. ఏ విషయంలోనైనా మనం సాధించగలమనే నమ్మకంతో ముందుకు సాగాలి. ఎల్లప్పుడూ ఆశావాదిగా ఉండాలి అనేది రచయిత అభిప్రాయం. అది చాలా వరకు నిజం. మనిషి ఏది సాధించాలన్నా దానిని సాధించగలనే నమ్మకం, ఉత్సాహం అవసరం. ఇతరుల మనసులు ఎలా గెలుచుకోవాలి అనే అధ్యాయంలో ఎదుటివారిని నొప్పించకుండా మాట్లాడితే వారు మన పట్ల ఆకర్షితులవుతారు. మన పనులు కూడా సులభంగా నెరవేరుతాయి. అదే విధంగా ఎదుటివారు చెప్పేది శ్రద్ధగా వినాలి. అప్పుడే వారు ఏమి చెబుతున్నారనేది మనకు పూర్తిగా అవగాహన అవుతుంది. ఎదుటి వారిని మాట్లాడకుండా చేసి అంతా మనమే మాట్లాడితే వారు విసుగుచెంది మరోసారి మన దగ్గరకు రావాలంటేనే భయపడతారు. అందువల్ల ఇతరులను ఆకర్షించాలంటే మన మాటతీరు కూడా ఎంతో ఆహ్లాదకరంగా, ఆకర్షణీయంగా మలచుకోవాలి.. మన మాటలతో ఇతరులను ఆకర్షించాలంటే ఎంతో సాధన చేయాల్సిన అవసరం కూడా ఉన్నదని పేర్కొన్నారు.



మీరే విజేతలు!
విజయాలన్నీ మీవే!!
రచన: సి.వి. సర్వేశ్వర శర్మ,
వెల: రూ.120/-,
ప్రతులకు: విక్టరీ పబ్లిషర్స్,
11-16-32(ఎ),
సింగరాజువారి వీధి, కొత్తపేట,
విజయవాడ - 520 001

ఈ గ్రంథంలో తీసుకొన్న ఉదాహరణలు ఎక్కువగా ఉన్నత స్థాయిలో ఉన్నాయి. ఉదాహరణలను సాధారణమైనవి తీసుకొని ఉంటే బాగుండేది. కొన్ని చోట్ల వాక్య నిర్మాణాలు కూడా అంత తేలికగా అర్థమయ్యేలా లేవు. వాటిని కొంత సులభమైన శైలిలో ఇచ్చి ఉంటే గ్రంథం ఇంకా మంచి రీడబిలిటీతో ఉండేది. కొన్ని అంశాలు విసుగు కల్గించేలా కూడా ఉన్నాయి. వాటన్నింటినీ జాగ్రత్తగా ఎడిట్ చేస్తే బాగుండేది. మొత్తం మీద ఈ పుస్తకం ఒక వ్యక్తి తన పనిలో, తన జీవితంలో విజయ పరంపరను సాగించాలంటే ఎలా కృషి చేయాలో చక్కగా ఇచ్చారు. కేవలం ఉద్యోగులు, ఉద్యోగార్థులకు మాత్రమే గాక విద్యార్థులకు కూడా చదువులో రాణించాలంటే ఎలా చదవాలి, ఏకాగ్రతను ఎలా సాధించాలి అనే అంశాలను కూడా పొందుపరిచారు.

అపజయాలు కలిగినప్పుడు నిరాశ చెందకుండా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో ఈ పుస్తకం బాగా ఉపయోగపడుతుందనడంలో సందేహం లేదు. ఇది ప్రతి ఒక్కరూ చదవదగ్గ పుస్తకం. విజయాల కోసం ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలి. కానీ ప్రతిదీ విజయంగానే మిగలాలంటే కష్టం. అందువల్ల కొన్ని పనులలో విజయాలు సాధించలేకపోయినా పట్టుదలతో విజయాల సాధనకు ప్రయత్నిండంలో ఇది ఎంతగానో సహాయపడుతుంది. రచయిత చేసిన ప్రయత్నం చాలా ప్రశంసనీయం. వీరి కలం నుంచి ఇలాంటివే మరికొన్ని ఉత్తమ పుస్తకాలు రావాలని ఆశిద్దాం.

- సింహాద్రి సరోజిని

స్వీకారం

నేనుచూచిన అమెరికా
కొన్ని విశ్లేషణ వ్యాసాలు
రచన: ప్రొఫెసర్ వి.వి.కృష్ణారావు,
ప్రతులకు: ప్రొఫెసర్ వి.వి.కృష్ణారావు, ఆంధ్ర లయోలా కాలేజీ, విజయవాడ



తెలంగాణ (కావ్యం)
రచన: వెలపాటి రామరెడ్డి, వెల: రూ.25/-,
ప్రతులకు: వెలపాటి రామరెడ్డి, 2-7-1166, కనకదుర్గకాలని, హన్మకొండ, వరంగల్, చింతల నర్సింలు&కో, హన్మకొండ; శ్రీసరస్వతి బుక్ డిపో, వరంగల్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, అన్నిబ్రాంచీలు, నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్

నమ్మకమా! నీకు నమస్కారం!
రచన: సత్య, వెల: రూ.90/-,
ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్

కృష్ణవేణీ తీరం..

విజయవాడ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గుండెకాయ వంటిది. ఒక పక్క కృష్ణవేణి గలగలలు, ప్రకాశం బ్యారేజీ, కనకదుర్గ కొలువుదీరిన ఇంద్రకీలాద్రి పర్వతం, నగరం గుండా ప్రవహించే మూడు కాలువలు, గాంధీకొండ, విక్టోరియా మ్యూజియం, అన్నింటికంటే ముఖ్యమైనది దక్షిణభారతదేశంలోనే పెద్ద రైల్వే జంక్షన్ ఈ నగరానికి వన్నె తెచ్చాయి.



ఇంద్రకీలాద్రి నిలయం

శేషు

విజయవాడలోని కనకదుర్గ ఆలయానికి, ఇంద్రకీలాద్రి పర్వతానికి చాలా ప్రాశస్త్యం ఉంది. ఆది శంకరాచార్యుడు ఈ ఆలయానికి 'శ్రీచక్రం' వేశారని చరిత్ర చెబుతోంది. దసరా నవరాత్రుల సందర్భంగా ఇక్కడ తొమ్మిది రోజులపాటు ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తారు. ఆ సమయంలో భక్తుల రద్దీ విపరీతంగా ఉంటుంది. రాష్ట్రంలో అధిక ఆదాయం గల ఆలయాల్లో కనకదుర్గ ఆలయం ఒకటి. మెట్ల వెంట ఆలయానికి వెళ్ళే దారిలో పర్వతం దిగువన అక్కన్న మాదన్న గుహలు కనిపిస్తాయి. వీటికి కొద్ది దూరంలోనే క్రీస్తుపూర్వం రెండవ శతాబ్దంలో తొలచిన త్రిమూర్తులు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల విగ్రహాలుంటాయి. దేశంలో ఏ ప్రాంతంవారైనా విజయవాడ వస్తే కనకదుర్గ ఆలయాన్ని తప్పక సందర్శిస్తారు.



గాంధీ పర్వతం

జాతిపిత గాంధీ స్మారకార్థం 1968లో రైల్వేస్టేషన్ వెనుకగల ఒక పర్వతంపై గాంధీస్థూపాన్ని నిర్మించారు. కొండపై భాగాన 15.8 మీటర్ల ఎత్తైన ఆ స్థూపం విజయవాడ నగరంలో ఎత్తైన కట్టడంగా చెప్పుకోవచ్చు. ఇక్కడ గాంధీ స్మారక గ్రంథాలయం, ప్లానిటోరియం, పిల్లల రైలు ప్రత్యేక ఆకర్షణ. పిల్లలు ఈ రైలులో పర్వతం చుట్టూ తిరిగిరావడం ఒక మధురానుభూతి. ఈ పర్వతం ఎక్కితే నగరమంతా కనిపిస్తుంది.

విక్టోరియా మ్యూజియం



బందరురోడ్డులో సబ్‌కలెక్టర్ కార్యాలయం పక్కనేగల విక్టోరియా మ్యూజియం చూడదగ్గ ప్రదేశం. మానవజాతి చరిత్ర, పరిణామక్రమం పట్ల ఆసక్తిగల వారికి ఇక్కడ ఎంతో ఉపయోగకరమైన సమాచారం లభిస్తుంది. పురాతనమైన వస్తువులు, విగ్రహాలు, ఆయుధాలు, పాత్రలు, పెయింటింగ్‌లు సహా ఎంతో విలువైన, అపరూపమైన మానవజాతి చరిత్రను విక్టోరియా మ్యూజియం తనలో దాచుకుంది.

నగరం నడిబొడ్డున గల మొగల్రాజపురంలో పర్వతాల్లో తొలచిన గుహాలయాలు చాలా ప్రాచీనమైనవి. వీటిని విష్ణుకుండినుల కాలంలో క్రీస్తుశకం 5వ శతాబ్దంలో నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. మొత్తం ఐదు గుహల్లో నటరాజ, వినాయక, అర్థనారీశ్వర విగ్రహాలు ప్రముఖమైనవి. ఇక్కడ గల అర్థనారీశ్వర విగ్రహం దక్షిణభారతదేశంలో మరెక్కడా లేదు. వీటి ఆలనాపాలనా లేక క్రమంగా శిథిలావస్థకు చేరుతున్నాయి.

ప్రకాశం బ్యారేజ్

కృష్ణానదిపై కృష్ణా, గుంటూరు జిల్లాలను కలుపుతూ నిర్మించిన ప్రకాశం బ్యారేజ్ 1957లో పూర్తయింది. నదిపై ఆధునిక పద్ధతుల్లో నిర్మించిన ఈ రెగ్యులేటర్ ద్వారా నాలుగు జిల్లాలకు కృష్ణా నదీ జలాలు అందుతున్నాయి. ఒక దశాబ్దం క్రితం వరకు మద్రాసు-కలకత్తా జాతీయరహదారిలో కీలకంగా ఉన్న ఈ రోడ్డు వంతెనపై ప్రస్తుతం భారీవాహనాలను అనుమతించడంలేదు. బ్యారేజ్ వెనుక గల రిజర్వాయర్ నీటినుండి పైకి వచ్చిన ద్వీపమే భవానీ ఐలాండ్. ప్రస్తుతం దీన్ని పర్యాటకుల కోసం అందంగా తీర్చిదిద్దుతున్నారు. 12 సంవత్సరాలకో సారి జరిగే కృష్ణా పుష్కరాలకు విజయవాడ నగరమే ప్రధానకేంద్రం. ఈ ఏడాది ఆగస్టులో జరగబోయే పుష్కరాలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి.

నగరానికి దగ్గరలోనే గల కొండపల్లి కొయ్య బొమ్మలకు ప్రసిద్ధి. ఇక్కడ తయారయ్యే బొమ్మలను విదేశాలకు కూడా ఎగుమతి చేస్తారు. ఈ బొమ్మలకు ఉపయోగించే కలప కొండపల్లి అడవుల్లో మాత్రమే లభ్యమవుతుంది. ★

మాంటిక్స్ సేకరణలో మహాసామ్రాజ్యం



వి.హరి

పురాతన చరిత్రను సామాజిక సేవా దృక్పథంతో, అందరితో పంచుకోవాలనే 'అభిరుచి'తో నరసింహారెడ్డి వివిధ రకాల మాంటిక్స్ సేకరణలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచారు. నరసరావుపేటకు చెందిన ఈయన అతి పిన్న వయసునుంచే (9వ ఏట నుంచి) ఈ సేకరణ ప్రారంభించి ఇప్పటికి 150 దేశాల నాణాలు, 150 దేశాల స్టాంపులు, 150 దేశాల కరెన్సీ నోట్లు, పోస్టు కార్డులు సేకరించి భద్రపరిచారు. పూర్వకాలంలో మానవ మనుగడను ప్రస్తుత జనావళి దృష్టికి తేవాలనే తలంపుతో ఈ కార్యక్రమానికి పూనుకున్నట్టు ఆయన తెలిపారు. ఆయన సేకరించిన సామాగ్రిని నరసరావుపేట, గుంటూరులలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో ప్రదర్శించి పలువురి ప్రశంసలందుకున్నారు. 1990వ సంవత్సరం నుండి ఇప్పటికి 5,000 రకాల దేశ, విదేశ నాణాలు సేకరించినట్లు నరసింహారెడ్డి తెలిపారు. వీటిలో భారతదేశాన్ని క్రీస్తుశకం ఒకటో శతాబ్దం నుండి బ్రిటిషు వారు వచ్చే వరకు పాలించిన రాజులు, సుల్తానులు, నవాబుల కాలాల్లో చలామణి అయిన 5,000 రకాల నాణాలు వున్నాయి. 1903లో బ్రిటీషు ఇండియా విడుదల చేసిన కాపర్ నాణాలైన ఎడ్వర్డు వన్ రూపీ, ఆఫ్ రూపీ, క్వార్టర్ రూపీ, బేడ, అర్థఅణా, దమ్మిడీ, కాపర్ నాణాలు, వెండి నాణాలను సేకరించారు. క్రిస్మస్ సందర్భంగా ఎలిజబెత్ రాణి విడుదల చేసిన 1914, 1921, 1933 పిన్ని నాణాలు, రిపబ్లిక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన అణాలు, ఆన్‌సర్క్యులేటెడ్ కాయిన్స్, అమెరికా విడుదల చేసిన మోనాలిసా కాయిన్ సేకరించిన ఘనత కూడా నరసింహారెడ్డికే దక్కింది. ఇవేకాక కాలానుగుణంగా వెలువడిన అనేక దేశాలకు సంబంధించిన కరెన్సీ నోట్లు, దస్తావేజులు, ఈస్టిండియా సెల్యులార్ కార్డులు, స్టాంపులు కూడా సేకరించారు. వివిధ దేశాలలో టెలిఫోన్ వినియోగదారులు ఇప్పటి వరకు వినియోగిస్తున్న కార్డులు, ఫస్టుడే కవర్‌లు, హైదరాబాద్ సంస్థానాన్ని పరిపాలించిన నిజాం నవాబులు వినియోగించిన టీకప్పులు నరసింహారెడ్డి సేకరణలో చోటు చేసుకున్నాయి. మన దేశానికి చెందినవే కాక ఐర్లాండ్, బ్రిటన్, జర్మనీ, కెనడా, స్కాట్‌లాండ్, స్పెయిన్, ఫ్రాన్స్ దేశాలకు సంబంధించిన పుష్ప చిహ్నాలు కూడా ఈయన సేకరించిన వాటిలో వున్నాయి. వినుకొండ దగ్గర విష్ణుకుండి నగర్‌లో విష్ణుకుండినుల నాటి నాణాలు, కొండవీడు దగ్గర రెడ్డిరాజుల నాణాలు సేకరించారు. వీటిసేకరణకు విజయవాడ, నెల్లూరు, హైదరాబాద్, మద్రాసు, బొంబాయి, కలకత్తా వెళ్ళి తనకు కావలసినవి సేకరించే వరకూ అక్కడే కాలం గడిపేవారు.

పురాతన నాణాల, వస్తువుల సేకరణలో గిన్నీస్ బుక్, లిమ్కాబుక్‌లలో స్థానం సంపాదించిన వారి విజయాలే తనకు స్ఫూర్తిదాయకమని నరసింహారెడ్డి అన్నారు. ఈ మాంటిక్స్ సేకరణకు గాను ఐదు లక్షలకు పైగా ఖర్చు పెట్టడమే కాక ఎన్నో వ్యయప్రయాసల కోర్చి వాటిని సేకరించి తన ప్రాణపదంగా భావించి కాపాడుకుంటూ వచ్చానన్నారు. వీటి సేకరణలో కొంతమంది నాణ్య శాస్త్రవేత్తలు, చరిత్రకారుల సహకారం, కొందరు కాలేజీ లెక్చరర్ల ప్రోత్సాహం, అభినందనలతో పాటు, కొందరి తిట్లను కూడా చవి చూడాల్సి వచ్చిందన్నారు.

2001వ సంవత్సరంలో సాలార్‌జంగ్ మ్యూజియం వారు ఆయన సేకరించిన వాటిని మ్యూజియంకు ఇవ్వమని, టంకశాల అటెండరుగా ఉద్యోగమిస్తామన్నప్పటికీ నరసింహారెడ్డి సున్నితంగా తిరస్కరించారు. మన రాష్ట్రంలోని కొన్ని మ్యూజియంలలో (గుంటూరు, హైదరాబాద్) రెండు సంవత్సరాల క్రితం తాను చూసిన పురాతన వస్తువులు ఇప్పుడు లేవనీ, విదేశాలలో అధిక గిరాకీ ఉండడంతో అమ్ముకుంటున్నారనీ ఆవేదన వ్యక్తపరిచారు. అందుకే తన సేకరణ సామాగ్రిని ఇవ్వడానికి సాహసించలేకపోయానన్నారు. ఆయా చిన్న నాణాలలో ఎందరి కష్టాలు, కడగళ్ళూ, మోసాలూ, కన్నీళ్ళు, ప్రార్థనలు, శాపనార్థాలు ఎన్నెన్ని ఇమిడి వున్నాయోనని భావోద్వేగంతో అన్నారు.

ఇప్పటికైనా పురావస్తు శాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తే వాటిని ప్రదర్శిస్తాననీ, ఏ మ్యూజియం వారు నా ఆకాంక్షల కనుగుణంగా తరతరాలకు చరిత్రను తెలిపే విధంగా వాటిని భద్రపరచగలరో వారికివ్వడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. ★

కనిష్కుడు - 1వ శతాబ్దం



పంచ్‌మార్క్‌డు కాయిన్స్ - 1వ శతాబ్దం



విష్ణుకుండి కాయిన్స్ (వినుకొండ)-17వ శతాబ్దం



సంఘర్షణ ఫలాలు

మాతృగడ్డకు అంకితులం
మాతృమూర్తికి కృతజ్ఞులం
మా కర్మ మాకు ఉపశమనం
మా రాత మాకు అనునయం
ఎండిన కళ్ళతో బావులు ఏడుస్తున్నాయి
చిట్లిన వొంటితో భూములు దుఃఖిస్తున్నాయి!
దేశం నిండా నదులుండవు
ఆకాశమంతా మబ్బులుండవు
భూగర్భమంతా జలముండదు
చంద్రుడికి దారేసిన వాడు
సూయజ్‌ను తవ్వినవాడు
గంగా గోదావరిని
కృష్ణా కావేరిని చేతులు కలపనివ్వడు!
మనుషులు అర్థిస్తున్నా
మూగజీవాలు మొరెత్తి ప్రార్థిస్తున్నా
రాయలసీమ రత్నాల నిలయమే
చుక్కనీరు చూపుకందదు

తెలంగాణా కోటి రత్నాల వీణే
ఎంతమోగినా నీళ్ళు పలకవు!
ఎగువ జన్మించడం అదృష్టం కాదు
దిగువ పుట్టడం శాపం కాదు
ఆ భూభాగమే యీ గడ్డ
ఆ మాతృమూర్తిదే ఈ బిడ్డ
పాలించే వాడు మరుస్తాడు
ప్రజలకు ఏం కావాలో
పరిపాలన ఏం యివ్వాలో...!
మఠం వేసి మడి చేతులు కట్టుకుంటే
పరిష్కారం పొడవదు
కొత్త మనిషి
కొత్త నేల
కొత్త తడి
కొత్త కంకి
సంఘర్షణ ఫలాలే!

- అడిగోపుల వెంకటరత్నమ్

కరువో కరువు...

కరువుకేమి కొదవలేదు కడపలోన
కవులకేమి కొదవలేదు కడపలోన
కంటతడిలేని కడపకాల్వ చెబుతుంది
మా కరువుపై కథ కందపద్యం
చినుకైనా లేని మా చెరువులు
చెబుతాయి
ఆ ఆకలిచావులపై చంపకమాలలు
ఊటలు ఉడిగిన మా బోరుబావులే
చెబుతాయి
ఉడుకుతున్న ఉదరాలపై
ఉత్పలమాలలు
తెగుళ్ల తగిలిన తెల్లనిపైరులు
చెబుతాయి
మా తాళి తాకట్టులపై తేటగీతులు
కరువుకేమి కొదవలేదు కడపలోన
కవులకేమి కొదవలేదు కడపలోన

-పలుకూరి వెంకటరమణ

పంగనామాల పంచాంగం

ప్రకృతి పలకలేదు నేటి
పంచాంగానికి
పొరబడి చేసితి పెద్దతప్పు
పంచాంగ పఠనమున
పలికిరి పండ్లతోటలు
బాగుగా పండునని పోయిన
వత్సరమున
అదివిని నేను అధికవడ్డీకి
అప్పుతెచ్చి
అరటితోటకు పెడితి
అరవైవేలు
పంటచేతికి రాకపోగా
పచ్చటి ఆకులు సైతం పగిలిపోయి
పైసా కూడా రాకపోయె
అసలును మించె వడ్డీ
అదిరిపడ్డ నేను ఆత్మహత్యకు పాల్పడితే
అరగని చావులని నిందమోపె
ప్రకృతి పలకదు నేటి పంచాగానికి
పొరబడి చేయకు తిరిగి పెద్దతప్పు



- ముదాం రామచంద్రయ్య

ADVOCATE

న్యాయ సలహాలు

ఎ.సత్యప్రసాద్, హైకోర్టు న్యాయవాది

కార్పొరేట్ ఆస్పత్రికి వెళితే కాలుపోయింది

నా పేరు తులసి నరసయ్య. వయస్సు 64 సంవత్సరాలు. ఎ.పి.ఎస్.ఇ.బి. ఖమ్మంలో రికార్డు అసిస్టెంటుగా పని చేసే వాడిని. నేను తేది. 28.2.97 సాయంత్రం డ్యూటీ దిగి టి.వి.సి.ఛాంప్ బండి మీద ఇంటికి వస్తుండగా దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురై నా ఎడమ కాలు ఎముక విరిగినది. మోకాలి చిప్ప పగిలిపోయింది. ఎడమ చేయి ముంజేతికీలు ఎముక విరిగి తొలగిపోయింది. తీవ్ర రక్తస్రావం జరిగింది. కోమాలోకి వెళ్ళిపోయాను. నా కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినారు. ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ డాక్టర్ అందుబాటులో లేరు. ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్ళమని చెప్పారు. ప్రైవేటు హాస్పిటల్‌కు తీసుకెళ్ళి పరీక్ష చేయించారు. ఆ డాక్టర్ గారు తగిన వైద్య పరికరాలు లేవని హైదరాబాద్‌లోని ఒక తీసుకెళ్ళండని రిఫర్ చేసి లెటర్ రాసి ఇచ్చినారు. వెంటనే అంబులెన్స్‌లో హైదరాబాద్ తరలించారు. తేది 1-3-97 రోజు ఉదయం 6 గంటలకు కార్పొరేట్ హాస్పిటల్ కార్పొరేట్ ఆస్పత్రికి డాక్టర్లు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి జాయిన్ చేసుకొని చికిత్స చేశారు. సుదీర్ఘకాలం చికిత్స తదుపరి వారి నిర్లక్ష్య వైద్యం వల్ల 'నా కాలు, చేయి బాగుపడలేదు. శాశ్వత అంగవైకల్యమేర్పడినది. ఒక్కో ఇంజక్షన్ రు.1100/- చొప్పున 60 ఇంజక్షన్లు చేసినాము ఇన్‌ఫెక్షన్ రాకుండా అని చెప్పినారు. అవసరం లేకున్నా డబ్బు రాబట్టే ధ్యేయంతో ప్లాస్టిక్ సర్జరీ చేశారు. మొత్తం రు.3,00,000/- వసూలు చేశారు. ఒక లక్ష రూపాయలకే బిల్లు ఇచ్చారు. ఇదేమిటని అడిగితే అది అంతే అన్నారు. నా కాలు చేయి ఎముకలు సరి చేయుటకు మళ్ళీ చికిత్స చేస్తామని ఎక్స్‌రేలు తీయించారు. కోలుకోవాలి మూడు నెలల తర్వాత రమ్మని డిశ్చార్జ్ చేసినారు. ఖమ్మం నుండి హైదరాబాద్ 5 సంవత్సరాల పాటు పలు పర్యాయాలు తిప్పించుకొని వెళ్ళినప్పుడల్లా ఏవో కుంటి సాకులు చెప్పి పంపించే వాళ్ళు. 5 సంవత్సరాలు ఇన్‌ఫెక్షన్‌తో బాధపడ్డాను. మీరు ఇచ్చిన ఇంజక్షన్ ఐదు పది రూపాయలవి కావచ్చు మోసం చేసి తిప్పుతున్నారు నా కాలు చేయి తిరిగి బాగు చేయాలి అని గౌరవ మేనేజింగ్ డైరెక్టర్, చికిత్స చేసిన డాక్టర్ గార్లకు రిజిస్టర్ ఎకనాలెడ్జ్‌మెంట్/డ్యూ ద్వారా లేఖలు పంపాను. తిరిగి రసీదులు ముట్టినవి. నేను ట్యాక్సీ కార్లో ఆ హాస్పిటల్‌కు వెళ్ళి వారిని కలిసి నా కాలు, చేయి బాగు చేయండని కోరినాను. బాగు చేయడం మా వల్ల కాదన్నారు. నాకు బాగు చేయకపోతే నష్టపరిహారం ఇవ్వండన్నాను. నేను మీ పేర్లు రాసి మీ హాస్పిటల్ ముందే ఆత్మహత్య చేసుకుంటానన్నాను. ఛస్తే మాకేం భయం లేదన్నారు. నేను ముఖ్యమంత్రి గారికి ఫిర్యాదు చేస్తానన్నాను. మా హాస్పిటల్‌కు వస్తాడు చూస్తావా అన్నారు. ప్రతిపక్షాల వద్ద కెళ్ళి ఫిర్యాదు చేస్తానన్నాను. వాండ్లకు వాండ్లే తన్నుకు ఛస్తున్నారు. నిన్ను కాసేదెవరో చెప్పుకోపో అన్నారు. నేను హైకోర్టు కెళ్ళి న్యాయం కోరతానన్నాను. రెండు సంవత్సరాలు దాటితే కోర్టులో చెల్లదు వెళ్ళిచూడు తెలుస్తుందన్నారు. బలవంతంగా త్రీవీల్ ఛైరులో నన్ను తీసుకెళ్ళి హాస్పిటల్ వెలుపల పడేసి వెళ్ళి పోయిన సెక్యూరిటీగార్డు వీళ్ళను నీవేమి చేయలేవు వెళ్ళిపొమ్మని చెప్పాడు. అంగవైకల్యం వల్ల వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకోవలసి వచ్చింది. నా దయనీయ స్థితిగతులను కరుణతో గుర్తించి పరిశీలించగలరు. నా వద్ద వాళ్ళు అనేక సార్లు తిప్పుకున్న ఆధారాలున్నవి మోసం చేసిన తీరు నిర్లక్ష్య వైద్యం అని రుజువు చేయగలను. న్యాయ సలహా ఇప్పించకోరుతూ ప్రార్థిస్తున్నాను.

- తులసి నరసయ్య, బాలాజీనగర్, ఖమ్మం జిల్లా

కార్పొరేట్ ఆస్పత్రిలో మీకు జరిగిన వైద్య చికిత్సకు సంబంధించి ఎటువంటి లోపం జరిగింది, దాని వల్లే మీకు అంగవైకల్యం ఏర్పడిందనేందుకు తగిన వివరాలు మీ ప్రశ్నలో లేవు. ఈ కార్పొరేట్ ఆస్పత్రుల్లో అవసరం ఉన్నా లేకపోయినా లక్షలాది రూపాయలు వసూలు చేయడం, సామాన్యుడు అందులో నలిగిపోవడం సర్వసాధారణమైంది. కాలుకి ప్లాస్టిక్ సర్జరీ చేయవలసిన అవసరం వచ్చిఉంటే చేసి ఉండవచ్చు. మీకు జరిగిన వైద్యంలో ఏమైనా లోపం జరిగి, దానికి ఆస్పత్రివారే కారణమని నిరూపించే ఆధారాలు మీ వద్ద ఉంటే మీకు సమీపంలోని కన్స్యూమర్ ఫోరంలో క్లయిమ్ దాఖలు చేయండి. మీకు జరిగిన నష్టానికి నష్టపరిహారం కూడా అడగండి. మీ దగ్గర ఉన్న పూర్తి వివరాలతో, హాస్పిటల్ వారి రికార్డ్‌తో న్యాయవాదిని సంప్రదించి క్లయిమ్ దాఖలు చేయండి. మీకు న్యాయం జరగవచ్చు.

రుచి

మ్యాంగో లస్సీ

కావలసిన వస్తువులు:

పెరుగు	: 125 గ్రాములు
చల్లని నీరు	: 200 మి.లీ.
ఐస్ క్యూబ్స్	: 8
మామిడి పండు	: ఒకటి
పుదీనా పొడి	: ఓ చిటికెడు

తయారు చేసే విధానం:

మామిడి పండును తొక్కతీసి ముక్కలుగా కోసుకోవాలి. వీటిలో పైన పేర్కొన్న పదార్థాలన్నీ కలిసి మిక్సీలో వేయాలి. చల్లచల్లని మ్యాంగో లస్సీని అందరూ ఇష్టంగా తాగుతారు.



మైదా పిండితో బొబ్బట్లు

కావలసిన వస్తువులు:

మైదాపిండి	: ఒక కిలో
పచ్చి శనగపప్పు	: పావు కిలో
బెల్లం	: పావు కిలో
ఎండుకొబ్బరి	: ఒక చిప్ప
నెయ్యి	: పావు కిలో
ఏలకులు	: 10

తయారు చేసే విధానం:

మైదా పిండిని శుభ్రంగా జల్లించుకోవాలి. దానిలో కొంచెం నెయ్యి వేసి కలపాలి. ఇప్పుడు నీళ్ళుపోసి పూరీ పిండి కంటె కొంచెం లూజుగా కలపాలి. బెల్లం తరగాలి. యాలకులు పొడి కొట్టుకోవాలి. శనగపప్పు ఉడకబెట్టాలి. ఉడికాక బెల్లం, యాలకుల పొడి వేసి కలపాలి. కొబ్బరి కోరుకుని దానిలో కలపాలి. గట్టి పడినాక దించుకోవాలి. ఇవి నిమ్మకాయంత సైజులో ముద్దలుచేసుకోవాలి. పూరీ పిండిని తీసుకొని అందులో ఈ ముద్దను పెట్టి కవరు చేయాలి. చపాతీ కర్రతో లైటుగా వత్తుకోవాలి. వీటిని అట్లపెనం మీద నెయ్యివేసి కాల్చాలి. ఇవి వేడి మీద చాలా రుచిగా ఉంటాయి. నాలుగు రోజులు నిల్వ కూడా ఉంటాయి.

గమనిక

రాష్ట్రంలోని వివిధ జిల్లాలు వివిధ రకాల వంటకాలకు ప్రసిద్ధి. ఆసక్తి గల వారు ఆయా జిల్లాల్లో ప్రసిద్ధమైన వంటకం గురించి, దాని తయారీ విధానం గురించి రాసి పంపితే ప్రజాశక్తి ఆదివారం అనుబంధం రుచి పేజీలో ప్రచురిస్తాము. వంటకం ఫొటోతో పాటు రాసిన వారి ఫొటో కూడా పంపవలెను.

వంటలు పంపవలసిన చిరునామా:

రుచి, ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి, అశోక్‌నగర్,
స్ట్రీట్ నెం:1 హైదరాబాద్ 20

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ అపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా

అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక

- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు
అర్ధసంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761, మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది